J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74

నెల్లూరు, 10.01.2020, శుక్రవారం సంపుటి : 39 సంచిక : 32 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి


www.lawyerteluguweekly.com

→ అప్పుడు 23 జిల్లాల నుండి 13 జిల్లాలకు..

→ ఇప్పుడు 13 జిల్లాల నుండి 29 గ్రామాలకు...

→ కేంద్ర స్థాయి నుండి 'కుల'నాయకుడి స్థాయికి....

# అంచలంచెలుగా పతనం అంచులకు...



- కొంప ముంచింది బాబేనంటూ తెలుగు తమ్ముళ్ళ గగ్గోలు....

*నలభై ఐదేళ్ల రాజకీయ అనుభవమున్న చంద్రబాబునాయుడు నలభై ఏడేళ్ల వయసున్న వైయస్ జగన్మోహన్‌రెడ్డి వేసే ఎత్తులకు గింగిరాలు తిరుగుతున్నాడు. ఢిల్లీ స్థాయిలో చక్రం తిప్పుదామనుకున్న చంద్రబాబును గల్లీల్లో నిలబెట్టాడు. జాతీయ నాయకుడినని ప్రచారం చేసుకునే చంద్రబాబును గ్రామస్థాయి లీడర్‌గా మార్చేసాడు. చివరకు జనం కోసం కాకుండా ఒక కులం కోసం, ఒక ప్రాంతం కోసం తపనపడుతున్న నాయకుడిగా చంద్రబాబును ప్రజల ముందు నిలబెట్టడంలో వైయస్ జగన్మోహన్‌రెడ్డి విజయం సాధించాడు.*

తాను ముఖ్యమంత్రి అయ్యాక వైయస్ జగన్మోహన్‌రెడ్డి అమరావతినే రాజధానిగా కొనసాగించి వుంటే రాజకీయంగా అది ఆయనకు పెద్ద ప్రయోజనం కాదు. కాని, చంద్రబాబు వూహించినంత కాకపోయినా ఎంతోకొంత అభివృద్ధిని మాత్రం అక్కడ చేయాల్సివచ్చేది. అభివృద్ధి ఎవరు చేసినా చరిత్రలో పేరు మాత్రం చంద్రబాబుదే ఉంటుంది. అమరావతి నిర్మించిన ఘనత ఆయనదే అవుతుంది. రాజధానిని మార్చడం ద్వారా చంద్రబాబుకు అలాంటి బ్రాండ్ ఇమేజ్ లేకుండా చేయగలిగాడు జగన్. విశాఖపట్నంను రాజధానిగా చేయడం ద్వారా రాజధానిపై ఇక చంద్రబాబు ముద్ర ఏ మాత్రం వుండదు.

(మిగతా 11వ పేజీలో)

## 'స్థానిక' పోరుకు.. పచ్చజెండా!

▸ పల్లెల్లో ఎన్నికల జాతర



హైకోర్టు సిగ్నల్ ఇవ్వడంతో రాష్ట్రంలో స్థానిక ఎన్నికల పోరుకు తెరలేచినట్లయ్యింది. స్థానిక ఎన్నికలంటేనే గ్రామసీమల్లో ఓట్ల జాతర. పంతాలు,

(మిగతా 11వ పేజీలో)

పాఠకులకు, ప్రకటనకర్తలకు,
చందాదారులకు,
మిత్రులకు, శ్రేయోభిలాషులకు
సంక్రాంతి శుభాకాంక్షలు.
సం/-

## సినీ రంగంలోనూ...

# కు(క)ల కలం



### మెగాస్టార్ ఆధ్వర్యంలో విశాఖకు సినీ పరిశ్రమ?

*తెలుగు సినీ పరిశ్రమ... బాలీవుడ్ తర్వాత దేశంలోనే రెండో పెద్ద చిత్ర పరిశ్రమ. తెలుగు ప్రజలకు ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక మద్రాసు నుండి ఈ పరిశ్రమను హైదరాబాద్‌కు తీసుకురావడానికి 35ఏళ్లు పట్టింది.*

*2014లో ఆంధ్రప్రదేశ్ విభజన జరిగింది. కానీ తెలుగు సినీ పరిశ్రమ హైదరాబాద్‌కే పరిమితమైపోయింది. హైదరాబాద్‌ను వదిలి ఆంధ్రప్రదేశ్‌కు రానంటుంది. 2014లో చంద్రబాబునాయుడు అమరావతిని రాజధానిగా ప్రకటించగానే సినీ పరిశ్రమ నీరుగారిపోయింది. హైదరాబాద్‌ను వదిలే ప్రసక్తే లేదని అప్పుడే నిర్ణయించుకుంది.*

ఐదేళ్ల తర్వాత ముఖ్యమంత్రిగా వచ్చిన వైయస్ జగన్మోహన్‌రెడ్డి రాజధానిని విశాఖపట్నంకు మార్చడంతో సినీ పరిశ్రమలోనూ కొంత కదలిక వచ్చింది. తెలుగు సినీ పరిశ్రమను పూర్తిగా కాకున్నా పాక్షికంగానైనా విశాఖపట్నంకు తరలించే ప్రయత్నాలు మొదలయ్యాయి. ఇందుకు మొదటి అడుగు మెగాస్టార్ చిరంజీవే వేయడం గమనార్హం. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన మూవీ ఆర్టిస్ట్‌ల అసోసియేషన్ సమావేశంలో ఆయన... ఏపిలో సినీ పరిశ్రమ అభివృద్ధికి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి సహకరిస్తామని చెప్పారని, విశాఖలో కూడా సినీ పరిశ్రమను విస్తరించాల్సి వుందన్న విషయాన్ని ఆయన చెప్పకనే చెప్పాడు.

ఈరోజు తెలుగు సినీ పరిశ్రమలో ఐదు కుటుంబాలదే రాజ్యం. నందమూరి, అక్కినేని, దగ్గుపాటి, ఘట్టమనేని, మెగా ఫ్యామిలీ. 90 శాతం పరిశ్రమ ఈ కుటుంబాల చుట్టూనే నడుస్తోంది. అయితే ఇందులోనూ సామాజిక వర్గాల ఆధిపత్య పోరు వుంది. తెలుగు సినీ పరిశ్రమలో తొలి నుండి కమ్మ సామాజికవర్గం ఆధిపత్యం వుండగా, మెగాస్టార్ చిరంజీవి ఎదిగాక, ఆయన కుటుంబసభ్యులు రంగప్రవేశం చేశాక వారి

(మిగతా 11వ పేజీలో)





# ఎస్టీకే.. జడ్పీ పీఠ

స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో భాగంగా ముందస్తు అడుగు... రిజర్వేషన్‌లు ఖరారు చేయడం. ఎట్టకేలకు ఆ తంతు పూర్తయ్యింది. నెల్లూరు జిల్లా పరిషత్ ఛైర్మెన్ పీఠం తొలిసారిగా ఎస్టీ జనరల్‌కు రిజర్వ్ అయ్యింది. ఈమేరకు ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది. జిల్లాలో 46 జడ్పీటీసీలకుగాను ఎస్టీలకు 5, ఎస్సీలకు 12, బీసీలకు 14, జనరల్‌కు 15 రిజర్వ్ చేశారు. ఈ 46 స్థానాలలో అన్ని కేటగిరీలలో సగం సీట్లు మహిళలకే కేటాయించడం విశేషం.

చరిత్రలో తొలిసారిగా జిల్లా పరిషత్ ఛైర్మెన్ పీఠం ఎస్టీలను వరించనుంది. 1959లో జిల్లా పరిషత్ ఏర్పాటైనప్పటి నుండి కూడా అగ్రవర్ణాల వారితో పాటు బిసిలు, ఎస్సీలకు కూడా ఛైర్మెన్‌గా పనిచేసే అవకాశమొచ్చింది. ఎస్టీలకు మాత్రం ఎప్పుడూ రాలేదు. ఇప్పుడు తొలిసారిగా ఆ వర్గానికి కూడా అవకాశమొచ్చింది.

**రిజర్వేషన్‌ల వివరాలు**

| క్ర.సం. | మండలం | జడ్పీటీసీ | ఎంపిపి |
|---|---|---|---|
| 1 | సంగం | ఎస్టీ మహిళ | బిసి |
| 2 | ఇందుకూరుపేట | ఎస్టీ మహిళ | ఎస్సీ |
| 3 | నాయుడుపేట | ఎస్టీ మహిళ | ఎస్సీ |
| 4. | దొరవారిసత్రం | ఎస్టీ | ఎస్సీ |
| 5. | దక్కిలి | ఎస్టీ | జనరల్ మహిళ |
| 6. | వింజమూరు | ఎస్సీ మహిళ | ఎస్సీ మహిళ |
| 7. | రాపూరు | ఎస్సీ మహిళ | జనరల్ |
| 8. | మనుబోలు | ఎస్సీ మహిళ | ఎస్టీ మహిళ |
| 9. | పెళ్లకూరు | ఎస్సీ మహిళ | ఎస్సీ మహిళ |
| 10. | తడ | ఎస్సీ మహిళ | జనరల్ |
| 11. | వెంకటగిరి | ఎస్సీ మహిళ | ఎస్టీ |
| 12. | చిల్లకూరు | ఎస్సీ | ఎస్సీ |
| 13. | వాకాడు | ఎస్సీ | ఎస్టీ |
| 14. | చిట్టమూరు | ఎస్సీ | ఎస్సీ మహిళ |
| 15. | ఓజిలి | ఎస్సీ | జనరల్ మహిళ |
| 16. | సూళ్లూరుపేట | ఎస్సీ | ఎస్సీ |
| 17. | బాలాయపల్లి | ఎస్సీ | ఎస్సీ మహిళ |
| 18. | కొండాపురం | బిసి మహిళ | జనరల్ మహిళ |
| 19. | కోవూరు | బిసి మహిళ | జనరల్ |
| 20. | కొడవలూరు | బిసి మహిళ | జనరల్ |
| 21. | అల్లూరు | బిసి మహిళ | బిసి |
| 22. | బుచ్చిరెడ్డిపాళెం | బిసి మహిళ | బిసి |
| 23. | తోటపల్లిగూడూరు | బిసి మహిళ | ఎస్టీ మహిళ |
| 24. | పొదలకూరు | బిసి మహిళ | జనరల్ మహిళ |
| 25. | మర్రిపాడు | బిసి | బిసి |
| 26. | జలదంకి | బిసి | జనరల్ |
| 27. | బోగోలు | బిసి | బిసి |
| 28. | కలిగిరి | బిసి | జనరల్ మహిళ |
| 29. | అనంతసాగరం | బిసి | బిసి మహిళ |
| 30. | సైదాపురం | బిసి | బిసి |
| 31. | గూడూరు | బిసి | జనరల్ |
| 32. | దుత్తలూరు | జనరల్ మహిళ | జనరల్ మహిళ |
| 33. | కావలి | జనరల్ మహిళ | బిసి |
| 34. | ఆత్మకూరు | జనరల్ మహిళ | జనరల్ |
| 35. | వెంకటాచలం | జనరల్ మహిళ | బిసి మహిళ |
| 36. | ముత్తుకూరు | జనరల్ మహిళ | జనరల్ |
| 37. | కలువాయి | జనరల్ మహిళ | జనరల్ మహిళ |
| 38. | కోట | జనరల్ మహిళ | బిసి మహిళ |
| 39. | సీతారాంపురం | జనరల్ | బిసి మహిళ |
| 40. | ఉదయగిరి | జనరల్ | బిసి మహిళ |
| 41. | వరికుంటపాడు | జనరల్ | జనరల్ మహిళ |
| 42. | విడవలూరు | జనరల్ | బిసి |
| 43. | దగదర్తి | జనరల్ | బిసి మహిళ |
| 44. | ఏ.ఎస్. పేట | జనరల్ | బిసి మహిళ |
| 45. | నెల్లూరురూరల్ | జనరల్ | ఎస్సీ మహిళ |
| 46. | చేజర్ల | జనరల్ | జనరల్ |

# రైతులకు పూర్తి స్థాయిలో సాగునీరు - మంత్రి అనిల్

నెల్లూరు జిల్లాలోని ఉదయగిరి, ఆత్మకూరు నియోజకవర్గాల రైతులకు పూర్తి స్థాయిలో సాగునీరు అందించేందుకు అవసరమైన పనులపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని రాష్ట్ర జనవనరుల శాఖా మంత్రి పి. అనిల్ కుమార్‌యాదవ్ పేర్కొన్నారు. ఈనెల 5న నెల్లూరులోని నీటిపారుదల శాఖ సమావేశ మందిరంలో వెలుగొండ ప్రాజెక్ట్ అధికారులు, ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డితో మంత్రి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఉదయగిరి ప్రాంతంలో 65 వేల ఎకరాలు, ఆత్మకూరు నియోజకవర్గంలో 21 వేల ఎకరాలకు సాగునీరు వెలుగొండ ప్రాజెక్ట్‌తో అందాల్సి ఉందన్నారు. ఎస్ఈ నగేష్ మాట్లాడుతూ వెలుగొండ ప్రాజెక్ట్ ఫేజ్-2 పూర్తయితేనే పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయర్‌కు ఉదయగిరి బ్రాంచ్ కెనాల్‌తో నీరు అందిస్తామన్నారు. ఈ పని 2022 జూన్‌కు పూర్తి అవుతుందనడంతో మంత్రి మాట్లాడుతూ ఫేజ్-2 పనులు పూర్తయ్యేలోపు పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయర్ పనులకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, సీఈ జలంధర్, కంభం ఈఈ ప్రభాకర్ పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి అనిల్‌కుమార్‌యాదవ్

## నీటి పారుదలశాఖ భవనాలు అన్నీ ఒకేచోట...

నీటిపారుదలశాఖకు చెందిన భవనాలన్నీ ఒకే చోట ఉండేలా ప్రత్యేక కాంప్లెక్స్ నిర్మిస్తామని మంత్రి అనిల్‌కుమార్‌యాదవ్ అన్నారు. నీటిపారుదల శాఖ కార్యాలయంలో రూ. 2 కోట్లతో నూతన ఎస్ ఈ కార్యాలయానికి మంత్రితో పాటు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మరో రూ. 3కోట్లతో ఎస్ఈ కార్యాలయం పైనే మరో భవనం సెంట్రల్ డివిజన్‌కు ఈ ఏడాదిలోనే పనులు పూర్తి చేస్తామన్నారు. కార్యాలయాలన్నీ ఒకే ప్రాంతంలో ఉండేలా పాత ఎస్ఈ నివాస ప్రాంతంలో భవనాలు నిర్మిస్తామని పేర్కొన్నారు. సర్వేపల్లి కాలువ ఆధునీకరణకు 99కోట్లతో టెండర్ పిలిచామన్నారు.

సమావేశంలో ఎస్ఈ ప్రసాదరావు, ఈఈ కృష్ణమోహన్, అన్ని డివిజన్‌ల డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

## 19 నుంచి పల్స్ పోలియో

నెల్లూరుజిల్లాలో ఈనెల 19 నుండి 21వ తేదీ వరకు పల్స్ పోలియో కార్యక్రమ నిర్వహణకు వైద్య ఆరోగ్యశాఖ సమాయత్తం అవుతోంది. జిల్లా వ్యాప్తంగా సున్నా నుంచి 5ఏళ్ళలోపు 3,35,834 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసేందుకు అధికారులు నిర్దేశించుకున్నారు. తొలిరోజు 3072 పల్స్ పోలియో బూత్‌లలో చిన్నారులకు పోలియో చుక్కలు వేయనున్నారు. 20వతేది ఇంటింటికి తిరిగి చుక్కల మందు వేసుకోని చిన్నారులను గుర్తిస్తారు. 21వ తేదీన మిగిలిన చిన్నారులకు వేయనున్నారు. జిల్లా వ్యాప్తంగా బస్టాండులు, రైల్వే స్టేషన్లు తదితర ప్రాంతాల్లో 93 ట్రాన్సిట్ బూత్‌లను ఏర్పాటు చేయనున్నారు. ప్రయాణ సమయాల్లో చిన్నారులకు పోలియో చుక్కలు వేయలేరు కాబట్టి ఈ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన బూత్ లలో బిడ్డలకు చుక్కల మందును అందజేస్తారు. ఇతర ప్రాంతాల నుంచి వలస వచ్చిన పలు ప్రాంతాల్లో ఉండే చిన్నారులకు ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా 9127 మంది ఈ తరహా చిన్నారులు ఉన్నట్లు అధికారులు అంచనాలు రూపొందించారు. వీరికి 80 మొబైల్‌బూత్‌ల ద్వారా పోలియో చుక్కలు వేయనున్నారు.

సింహపురి సమాచారం

### బాబు మీద అక్కసుతోనే...

# రాజధాని మార్పు

**టీడీపీ నేతల విమర్శ**

మాజీ సీఎం చంద్రబాబునాయుడు చేపట్టిన అభివృద్ధిని చూడలేకే రాజధాని మార్పు చేపట్టారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర పేర్కొన్నారు. ఈనెల 8న వెంకటగిరిలో అమరావతి పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు శాంతియుత ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమరావతి రాజధాని నిర్మాణంలో తెలుగుదేశంపార్టీకి చెందిన నేతలు తప్పులు చేసివుంటే కేసులు పెట్టి జైల్లో పెట్టవచ్చున్నారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి తన ఆనందం, సంతృప్తి కోసం రాజధానిని విశాఖకు తరలిస్తున్నారని విమర్శించారు. మాజీఎమ్మెల్యే కురుగుండ్ల రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో పెట్టుబడిదారులు భయంతో ఇతర రాష్ట్రాలకు తరలివెళుతున్నారన్నారు. రాజధాని నిర్మాణాలకు లక్షకోట్ల రూపాయలు అవసరమని ప్రజలకు తప్పుడు సందేశం ఇస్తున్నారని విమర్శించారు. నుడా మాజీ ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో తుగ్లక్ పాలన సాగుతోందని దుయ్యబట్టారు. కాశీపేట సెంటర్ నుండి పోలేరమ్మ ఆర్చి, పాత బస్టాండ్ మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. అమరావతినే రాజధానిగా కొనసాగించాలంటూ తహసీల్దార్ రవీంద్రబాబుకు వినతి పత్రం సమర్పించారు. జనసేన నాయకుడు వెంకటేశ్వర్లు, మాజీ ఏఎంసీ ఛైర్మన్లు సీసీనాయుడు, రాజేశ్వరరావు, బీరం రాజేశ్వరరావు, ఆనంద్, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, బాషా, గంగాధర్, నరశింహులు, నాగరాజు, విశ్వనాథం పాల్గొన్నారు.

## 'దిశ' పోలీస్‌స్టేషన్ ఏర్పాటుకు సన్నాహాలు

మహిళలు, చిన్నారుల రక్షణకు పూర్తిస్థాయిలో కట్టుదిట్టమైన చర్యలు తీసుకునేందుకు నెల్లూరు నగరంలో 'దిశ' పోలీస్‌స్టేషన్ ఏర్పాటుకు పోలీసుశాఖ చర్యలు తీసుకుంటోంది. దీంతో, మహిళా పోలీస్‌స్టేషన్ 'దిశ' పోలీస్‌స్టేషన్‌గా మార్పు కానుంది. జిల్లావ్యాప్తంగా మహిళలపై జరిగే నేరాలు, ఘోరాలు, లైంగిక దాడులు, హత్యలు, పాశవికచర్యలు, యాసిడ్‌దాడులు, ఫోక్సో తదితర కేసులు అన్నీ ఇకనుంచీ ఈ పోలీస్‌స్టేషన్ పరిధిలోకే రానున్నాయి. ప్రస్తుతం మహిళా పోలీస్‌స్టేషన్‌లో ఒక డిఎస్పీ, ఇద్దరు ఎస్ఐలు, సిబ్బంది ఉన్నారు. వీరితోపాటు అదనంగా ఒక ఎస్ఐతో పాటు మరికొంతమంది పోలీసు సిబ్బందిని 'దిశ' స్టేషన్‌కు కేటాయించాలని, వివిధ కేసుల్లో వైద్యపరీక్షలు అవసరమవుతాయి కనుక ప్రభుత్వాసుపత్రి ప్రాంగణంలోనే 'దిశ' పోలీస్‌స్టేషన్ ఏర్పాటుచేస్తే కేసుల సత్వర పరిష్కారానికి అందుబాటులో ఉన్నట్లవుతుందని అధికారులు భావిస్తున్నట్లు తెలుస్తోంది.

### జడ్పీ వాకర్స్ ఆధ్వర్యంలో

## ఉచిత వైద్యశిబిరం



నెల్లూరు పొదలకూరురోడ్డులోని జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణంలో ఈనెల 5న జడ్పీ వాకర్స్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని సింహపురి హాస్పిటల్ సహకారంతో నిర్వహించారు. వాకర్స్ సభ్యులకు డాక్టర్లు బీపీ, షుగర్ తదితర పరీక్షలను నిర్వహించి తగిన సలహాలు ఇచ్చారు. జడ్పీ వాకర్స్ అధ్యక్షులు భాస్కరరెడ్డి, ప్రచార కార్యదర్శి మండవ శ్రీనివాసరావు పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. చెంచయ్య, శ్రీనివాసులు, అనంతరామయ్య, శేషారెడ్డి, రాణెమ్మ, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

### డిప్యూటీ తహసీల్దార్‌కు

## అదనపు బాధ్యతలు

నెల్లూరు రూరల్ మండలం ఇన్ చార్జి తహసీల్దార్‌గా ఎస్‌కే నాజర్ ఈనెల 8న అదనపు బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యాలయంలో ఆర్ఐ గా విధులు నిర్వహిస్తున్న ఆయనకు ఇటీవల డిప్యూటీ తహసీల్దార్‌గా పదోన్నతి లభించింది.

### అమ్మవారి ఆశీస్సులతో..

# అంతా మంచే జరుగుతుంది

**- జొన్నవాడ దేవస్థానం పాలకమండలి ప్రమాణస్వీకారోత్సవంలో మంత్రి అనిల్, ఎంపి విపిఆర్**

బుచ్చిరెడ్డిపాలెం మండలం జొన్నవాడ లోని మల్లిఖార్జునస్వామి సమేత కామాక్షి తాయి అమ్మవారి దేవస్థానం నూతన పాలకమండలి ప్రమాణస్వీకారం ఈ నెల 5వ తేదీన ఆలయం వద్ద అట్టహాసంగా జరిగింది. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి పి. అనిల్‌కుమార్‌యాదవ్, రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపి మేకపాటి రాజమోహన్‌రెడ్డి, కోవూరు శాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా రాగా, వారి సమక్షంలో ఆలయ ఛైర్మెన్‌గా చీమల రమేష్‌బాబు, పాలకమండలి సభ్యులుగా కోడూరు మధు సూదన్‌రెడ్డి, గుమ్మా ప్రమీలమ్మ, ఇన్నమూరి నరసింహారావు, పిడుగు సంగీతమ్మ, బి.వెంకటరమణయ్య, సింగారెడ్డి సుమిత్రమ్మ, ఆములూరు విమల, తాతా ప్రభాకర్, ఎక్స్ అఫిషియో సభ్యుడిగా ఉపప్రధానార్చకుడు శ్రీశైలం శశిశేఖర్‌శర్మలు ప్రమాణస్వీకారం చేశారు. కామాక్షమ్మ తల్లి చల్లని చూపుతో, ఆమె కరుణతో ఈ జిల్లా అభివృద్ధి చెందాలని, ఆలయ అభివృద్ధికి కొత్త పాలకమండలి సభ్యులు కలిసికట్టుగా కృషి చేయాలని మంత్రి అనిల్, ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిలు ఆకాంక్షిస్తూ, అభినందనలు తెలిపారు.



జొన్నవాడ దేవస్థానం ఛైర్మెన్‌గా ప్రమాణస్వీకారం చేస్తున్న రమేష్‌బాబు

ఈ కార్యక్రమంలో ఆలయ ఇ.ఓ ఏ.వి.శ్రీనివాసులురెడ్డి, వైసిపి నాయకులు పి.రూప్‌కుమార్‌యాదవ్, సూరా శ్రీనివాసులురెడ్డి, నలుబోలు సుబ్బారెడ్డి, ఇప్పగుంట విజయభాస్కర్‌రెడ్డి, బెజవాడ గోవర్ధన్‌రెడ్డి, డీసీఎంఎస్ ఛైర్మెన్ వీరి చలపతి, ఆర్టీఓ హుస్సేన్‌భాషా, నెల్లూరు రూరల్ డిఎస్పీ రాఘవరెడ్డి పాల్గొన్నారు.

## మంత్రి మేకపాటి ఓఎస్‌డిగా పెంచలరెడ్డి



రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి ఓఎస్‌డిగా చల్లా పెంచలరెడ్డి నియమితులయ్యారు. వైసిపి అధికారంలోకి వచ్చాక సీఎం పేషీలో పనిచేస్తున్న ఆయనను గౌతమ్‌రెడ్డే ఏరికోరి ఓఎస్‌డిగా నియమించుకున్నాడు. నెల్లూరుజిల్లాలో పెంచలరెడ్డి అంటే తెలియనివాళ్ళుండరు. నెల్లూరు ఎమ్మార్వోను మొదలుకొని, నిన్నటి తెలుగుదేశం ప్రభుత్వంలో ఐదేళ్ల పాటు మున్సిపల్ మంత్రి పి.నారాయణ ఓఎస్‌డి వరకు సాగిన ప్రస్థానంలో ఎన్నో హోదాలలో పనిచేశారు. జిల్లాలోనే పలుచోట్ల ఎమ్మార్వోగా చేసిన ఆయన ఆ తర్వాత వివిధ చోట్ల ఆర్డీఓగా, డిఆర్‌ఓగా, తిరుపతి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ ఛైర్మెన్‌గా, నెల్లూరు జడ్పీ సిఇఓగా సేవలిందించారు. ఏ బాధ్యత అప్పగించినా సమర్ధవంతంగా నెట్టుకొస్తాడు. రాజకీయాలకతీతంగా అందరివాడనే ముద్ర కూడా వుంది. మరి మేకపాటి వాళ్ల వద్ద ఎలా రాణిస్తాడో చూడాలి!

# రాజధాని.. రాష్ట్రం ఇష్టం!

**- బీజేపీ జాతీయ ప్రధానకార్యదర్శి మురళీధర్‌రావు**



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మురళీధర్‌రావు

రాష్ట్రానికి రాజధానిని నిర్ణయించుకునే అధికారం పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వానిదేనని బీజేపీ జాతీయ ప్రధానకార్యదర్శి మురళీధర్‌రావు పేర్కొన్నాడు. 8వ తేదీ నెల్లూరులోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజధానిపై చట్టబద్ధమైన అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి వుంటుందని, బీజేపీ పార్టీ రాజకీయ అభిప్రాయాన్ని మాత్రమే చెబుతుందని వెల్లడించాడు. అమరావతిలో రాజధాని కోసం శంకుస్థాపన జరిగింది. కాబట్టి తాము ఇంతవరకు దానినే రాజధానిగా భావిస్తున్నామన్నాడు. అభివృద్ధి వికేంద్రీకరణకు బీజేపీ ప్రాధాన్యతనిస్తుందని, అమరావతి, విశాఖపట్నం, కర్నూలులు సమస్థాయిలో అభివృద్ధి చెందాలన్నదే తమ ఆకాంక్షగా ఆయన పేర్కొన్నాడు.

పౌరసత్వ సవరణ చట్టంపై కాంగ్రెస్, వామపక్షాలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని ఆయన ఆరోపించాడు. ఈ చట్టం 130 కోట్ల మంది భారతీయులను ఇబ్బంది పెట్టదు. ఈ దేశంలో పుట్టి, ఈ మట్టిపై బ్రతుకుతున్న వారంతా భారతీయులే! పాకిస్థాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్థాన్‌లలో మతపరమైన వేధింపులకు గురికాబడి ఈ దేశానికి వలసవచ్చిన శరణార్ధులను ఆదుకునే ఉద్దేశ్యంతోనే ఈ చట్టం తెచ్చామన్నాడు. పౌరసత్వ సవరణ చట్టాన్ని వ్యతిరేకించే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు లేదని, ప్రతిఒక్క రాష్ట్రం దీనిని అమలు చేయాల్సిందేనన్నాడు.

ఈ సమావేశంలో పార్టీ సీనియర్ నాయకుడు సన్నపరెడ్డి సురేష్‌రెడ్డి, కర్నాటి ఆంజనేయరెడ్డి, పి.సురేంద్రరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు డి.భరత్‌కుమార్, ఎం.ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు



## 'ప్రభా'తం

# ఏ కమిటీ చెప్పినా ఒకటే మంత్రం

మానవ జీవనయానంలో కొన్ని ప్రధాన సూత్రాలుంటాయి. ప్రతిఒక్కరూ వాటిని అనుసరిస్తూ పోవాల్సిందే! అట్లాగే పరిపాలనా, అభివృద్ధి ప్రక్రియలలోనూ కొన్ని సూత్రాలుంటాయి. ఏ పరిపాలకుడైనా వాటిని అనుసరిస్తే వచ్చే ఇబ్బందేమీ వుండదు. ఆ ప్రధాన సూత్రాలను అనుసరించకపోబట్టే జాతీయ స్థాయి నాయకుడిగా వెలిగిపోదామనుకున్న మాజీముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఇప్పుడు ఒక ప్రాంతీయ స్థాయి నాయకుడిగా మారిపోయాడు.

ఆంధ్రప్రదేశ్ రాజధాని ఎంపిక విషయంలో గత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేసిన తప్పును సరిదిద్దే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి వికేంద్రీకరణకు శ్రీకారం చుడుతూ మూడు ప్రాంతాలలో మూడు రాజధానుల ఏర్పాటు దిశగా నడుం కట్టింది. ఈ నిర్ణయానికి రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల ప్రజలు మద్దతు పలుకుతున్నారు. కాని, 29 గ్రామాల ప్రజలు రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నారు. రాజధానిని తమ గ్రామాలలోనే పెట్టాలంటూ ఆందోళనలు చేస్తున్నారు. రాజధాని ఆందోళనలు ఆ గ్రామాలలో తప్పితే రాష్ట్ర వ్యాప్తంగా ఇంకెక్కడా లేవు. ఈ కొన్ని గ్రామాల ప్రజలు, రైతులైనా రోడ్డెక్కడానికి, ఆందోళనలు చేయడానికి దారితీసిన కారణాలేమిటని విశ్లేషిస్తే... కమిటీల రూపంలో మేధావులు ఇచ్చిన నివేదికలను బుట్టదాఖలు చేసి కుల సంకుచిత స్వభావంతో అభివృద్ధినంతా ఒకేచోట కేంద్రీకృతం చేసి, కులాధిపత్య సామ్రాజ్యాన్ని నిర్మించాలని చేసిన కుటిల ప్రయత్నాల ఫలితమే!

రాష్ట్ర విభజన తర్వాత రాజధాని ఎంపికపై నియమించిన శ్రీకృష్ణ కమిటీ గాని, శివరామకృష్ణన్ కమిషన్ గాని మొత్తుకుని చెప్పాయి... రాజధాని ఎంపిక పారదర్శకంగా వుండాలని, అభివృద్ధి వికేంద్రీకరణ జరగాలని, అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందేలా రాజధాని నిర్మాణం వుండాలని. ఈ రెండు కమిటీలు కూడా అమరావతి ప్రాంతంలో రాజధానిని వ్యతిరేకించాయి. దీనికి కారణం రాజధాని అక్కడ ప్రకటిస్తే లక్షలాది ఎకరాలు బంగారు పంటలు పండే మాగాణి భూములు వాణిజ్య, వ్యాపార, నివాస కేంద్రాలుగా మారుతాయని, వ్యవసాయ ఉత్పత్తులు తగ్గిపోతాయని. అంతేకాదు, అమరావతి మునకప్రాంతం. ఇక్కడ రాజధాని నిర్మాణం వ్యయప్రయాసలతో కూడిన పని అని ఆ కమిటీలు తేల్చిచెప్పాయి. దొనకొండ, వినుకొండ వంటి మెట్ట ప్రాంతాలను రాజధానికి అనువైనవిగా సూచించాయి. అక్కడ ఎన్నివేల ఎకరాల భూములను రాజధానికి వాడుకున్నా వచ్చిన ఇబ్బందేమీ లేదు. ఎందుకంటే అవి పెద్దగా వ్యవసాయ యోగ్యమైన భూములు కావు. ఇంకా రాజధానిని అలాంటి చోట్ల ప్రకటిస్తే పది, పరకా విలువ వుండే భూములకు విలువ వస్తుంది. కోట్ల రూపాయలకు వాటి ధరలు చేరుతాయి. సంపద సృష్టించబడుతుంది. ఇందుకు హైదరాబాద్‌నే ఉదాహరణగా తీసుకోవచ్చు. ఈరోజు హైదరాబాద్ అంతర్జాతీయ స్థాయి నగరంగా ఎదుగుతోంది. హైదరాబాద్ అంతా కొండలు, గుట్టలే! గతంలో ఇక్కడ భూములకు పెద్దగా విలువ వుండేది కాదు. ఇప్పుడు ఎకరా కోటి నుండి ప్రాంతాన్ని బట్టి వందకోట్ల దాకా కూడా పలుకుతోంది. అంటే కేవలం రాజధాని మూలంగా గడ్డిపరకలు కూడా మొలవని భూముల ద్వారా లక్షల కోట్ల సంపద అక్కడ సృష్టించబడింది. హైదరాబాద్ అంతర్జాతీయ రాజధానిగా ఎదుగుతున్నా గట్టిగా వెయ్యి ఎకరాల మాగాణి భూములు కూడా పాడై వుండవు. అంతా బంజరునేలలే!

రెండుకార్లు పండే మాగాణి భూములను నాశనం చేయకుండానే రాష్ట్ర రాజధాని నిర్మాణానికి అవకాశాలున్నా చంద్రబాబు ఆ పని చేయలేదు. శ్రీకృష్ణ కమిటీ సభ్యులకుగాని, శివరామకృష్ణన్ కమిషన్ సభ్యులకు గాని దొనకొండ, వినుకొండలలో భూములు లేవు. రాజధానిపై ఇచ్చిన నివేదికలో వాళ్ళు స్వలాభం చూసుకోలేదు. మంచి పొలాలు నాశనం కాకుండా, మెట్ట ప్రాంతాలు అభివృద్ధి చెందేలా తమ నివేదికలలో సూచనలు చేశారు. చంద్రబాబు వాటిని కంటితో కూడా చూడలేదు. కళ్లకు కులపైత్యం కమ్మేసి వుండడంతో తూతూ మంత్రంగా నారాయణ కమిటీ వేసి, తన ఆలోచనకు అనుగుణంగా నివేదిక తెప్పించుకుని అమరావతిని ఎంపిక చేసుకుని కులరాజధాని నిర్మాణానికి ప్రయత్నించాడు. దుర్బుద్ధితో చేసే ఏ పనికీ దేవుడు సానుకూలంగా స్పందించడు. కాబట్టి అమరావతి అలా తగలబడింది. నిన్న జిఎన్ రావు కమిటీ అయినా, ఈరోజు బోస్టన్ కన్సల్టెంట్ గ్రూప్ ఇచ్చిన నివేదిక అయినా అభివృద్ధి వికేంద్రీకరణ, రాజధాని సత్వరంగా అభివృద్ధి చెందే అంశాలకే ప్రాధాన్యతనిచ్చాయి గాని, ఏ ఒక్క ప్రాంతాన్ని కూడా చిన్నచూపు చూడలేదు.

చంద్రబాబు లాగా వైయస్ జగన్మోహన్‌రెడ్డి కూడా రాజధానిపై కుల స్వభావంతో ఆలోచించి వుంటే రాజధానిని కడపలోనో, కర్నూలులోనో పెట్టుకుని వుండేవాడు గాని, తన తల్లిని ఓడించిన విశాఖపట్నంలో పెట్టుండేవాడు కాదు. ఆయన రాజధానిపై పారదర్శకంగా ఆలోచించడమే కాదు, మేధావుల సూచనలను అనుసరిస్తున్నాడు కాబట్టే రాష్ట్ర ప్రజలు కూడా రాజధానిపై ప్రభుత్వ నిర్ణయాలకు ఆమోదం తెలుపుతారు.

ఐదేళ్ల క్రితమే చంద్రబాబు మేధావుల సలహాలను బట్టి, రాష్ట్ర భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని రాజధానిపై నిర్ణయం తీసుకుని వుంటే ఈరోజు ఇంత రచ్చ అవసరం ఉండేది కాదు.

**రాష్ట్ర విభజన తర్వాత రాజధాని ఎంపికపై నియమించిన శ్రీకృష్ణ కమిటీ గాని, శివరామ కృష్ణన్ కమిషన్ గాని మొత్తుకుని చెప్పాయి... రాజధాని ఎంపిక పారదర్శకంగా వుండాలని, అభివృద్ధి వికేంద్రీకరణ జరగాలని, అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందేలా రాజధాని నిర్మాణం వుండాలని. ఈ రెండు కమిటీలు కూడా అమరావతి ప్రాంతంలో రాజధానిని వ్యతిరేకించాయి. నిన్న జిఎన్ రావు కమిటీ అయినా, ఈరోజు బోస్టన్ కన్సల్టెంట్ గ్రూప్ ఇచ్చిన నివేదిక అయినా అభివృద్ధి వికేంద్రీకరణ, రాజధాని సత్వరంగా అభివృద్ధి చెందే అంశాలకే ప్రాధాన్యతనిచ్చాయి.**



### ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు
## త్వరలో ప్రత్యేక కార్పొరేషన్

రాష్ట్రంలోని వివిధ శాఖల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల అభ్యున్నతి కోసం రాష్ట్రప్రభుత్వం ఒక ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటుచేసేందుకు కృషి చేస్తోందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి మేకపాటి గౌతంరెడ్డి చెప్పారు. ఈనెల 4న ఆయన నెల్లూరులోని తన నివాసంలో రాష్ట్ర ఎస్సీ ఎస్టీ బీసీ హాస్టల్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు అవసరమైన అన్ని రకాల సౌకర్యాల కల్పనకు ఈ కార్పొరేషన్ ఉపయోగపడాలన్నది ప్రభుత్వ ఉద్దేశ్యమన్నారు. ఈకార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి అల్లం సురేష్‌బాబు, బీసీ సెల్ కన్వీనర్ గోతం వెంకట సుబ్బయ్యయాదవ్, తూమాటి విజయభాస్కర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, అసోసియేషన్ నాయకులు వెంకటేశ్వర్లు, సుధాకర్, ప్రసాద్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

### ఆర్టీసీ ఉద్యోగులకు
## పింఛన్ ఇవ్వాలి
**- ఇ.యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజ్ఞప్తి**

ఆర్టీసీ ఉద్యోగులకు పింఛన్ సౌకర్యం కల్పించాలని ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్రప్రధాన కార్యదర్శి పలిశెట్టి దామోదర్‌రావు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు. నెల్లూరు ఆర్టీసీ బస్టాండ్‌లోని ఇ.యు కార్యాలయంలో ఈనెల 4న ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం చరిత్రాత్మకమైన విషయమని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఆర్టీసీలో పనిచేస్తున్న 52వేల మందికి పాత పింఛన్ విధానం వర్తించేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, నాయకులు మాబూ, నారాయణరావు, జోనల్ కార్యదర్శి బాబూ శ్యామ్యూల్, రీజినల్ అధ్యక్షుడు ప్రసాద్, కార్యదర్శి శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### జొన్నవాడలో
## హైకోర్టు న్యాయమూర్తి

బుచ్చిరెడ్డిపాలెం జొన్నవాడలో వెలసి వున్న శ్రీ మల్లికార్జున సమేత కామాక్షితాయి అమ్మవారి ఆలయాన్ని ఈనెల4న హైకోర్టు న్యాయమూర్తి విజయలక్ష్మి దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి కృష్ణయ్య, ప్రోటోకాల్ జడ్జి ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పెద్దాసుపత్రిలో కలెక్టర్ తనిఖీ

నెల్లూరు ప్రభుత్వాసుపత్రిలో జిల్లా కలెక్టర్ యంవి శేషగిరిబాబు, జాయింట్ కలెక్టర్ వినోద్‌కుమార్‌తో కలిసి ఈనెల 3న ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ప్రసూతి కేంద్రంలోని ఎస్ఎన్‌సీయూ, బాలింతల వార్డు తదితర విభాగాలను, పలు రికార్డులను పరిశీలించారు. అక్కడ వున్న సమస్యలపై ఆసుపత్రి ఉన్నతాధికారులకు తగు సూచనలు అందజేశారు. ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ రాధా కృష్ణరాజు, డిప్యూటీ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, డాక్టర్లు పాల్గొన్నారు.

## లూయీ బ్రెయిలీ జయంతి

నెల్లూరులోని ఆర్ఎస్ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈనెల 4న లూయీ బ్రెయిలీ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా లూయీ బ్రెయిలీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రోటరీక్లబ్ సౌత్ జోన్ అధ్యక్షుడు, పాఠశాల సైన్స్ ఉపాధ్యాయుడు సతీష్‌కుమార్ పాల్గొన్నారు.




## కుల రాజధాని అయ్యేది

రాష్ట్ర రాజధానిని విశాఖపట్నంకు మార్చడం ద్వారా ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి సరైన నిర్ణయం తీసుకున్నారు. చంద్రబాబునాయుడు ఒక కుల ఆధిపత్యం వుండే రాజధానిని నిర్మించాలనుకున్నాడు. అందుకు అమరావతిని ఎంపిక చేసుకున్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు కట్టిన పన్నులతో కేవలం ఒక వర్గం వారికి ప్రయోజనం చేకూరేలా, వారి ఆధిపత్యం వుండేలా అమరావతిని తయారు చేయాలనుకున్నారు. అమరావతియే రాజధానిగా కొనసాగితే హైదరాబాద్ స్థాయి అభివృద్ధిని అందుకోవడానికి దశాబ్దాలు కాదు, శతాబ్దాలు గడిచినా ఆశ్చర్యపోవాల్సిందేమీ లేదు.

**ఎస్.వి.రాంప్రసాద్, నెల్లూరు.**

## ఇతర దేశాలకు పోగలరా?

ఎన్ఆర్‌సి, సిఏఏ బిల్లులకు వ్యతిరేకంగా కొందరు చేస్తున్న ఉద్యమాలు దేశానికి ప్రమాదకరంగా మారే పరిస్థితి వుంది. పౌరసత్వం లేకుండా ఏ పౌరుడైనా ఇతర దేశాలలో వుండగలడా? మరి భారతదేశంలో మాత్రం ఎందుకుండాలి? ఇదేమన్నా ధర్మసత్రమా? దేశ విభజన తోనే భారత్, పాక్, బంగ్లాదేశ్‌లకు ఎవరి భూభాగాలు వారికి ఏర్పడ్డాయి. పాకిస్థాన్ తన దేశం నుండి హిందువులను తరిమేసినా భారత్ మాత్రం ముస్లింలను తనలో కలుపుకుంది. అందరికీ సమాన హక్కులు కల్పించింది. ఎన్ఆర్‌సి వల్ల ఇక్కడవున్న ముస్లింలకు సమస్య లేదు. బంగ్లాదేశ్, మయన్మార్ దేశాల నుండి అక్రమ చొరబాట్లు అరికట్టడానికే ఈ చర్యలు. ముస్లింలు కూడా ఈ బిల్లును సమర్థించాలి.

**వి.శేషాచారి, హైదరాబాద్.**

## సినీ పరిశ్రమను విశాఖకు తరలించాలి

లక్షల మందికి ఉపాధి, వేలకోట్లలో లావాదేవీలు జరుగుతున్న అతిపెద్ద పరిశ్రమ సినిమా పరిశ్రమ. ఇదొక ప్రత్యేక ప్రపంచం. హైదరాబాద్‌లో వున్న తెలుగు సినీ పరిశ్రమ 95శాతం ఆంధ్రావాళ్లదే! రాష్ట్ర విభజన జరిగి 5ఏళ్లు దాటినా తెలుగు సినీ పరిశ్రమ హైదరాబాద్‌ను వదలడం లేదు. ఇప్పుడు విశాఖపట్టణమే రాజధాని అని ప్రభుత్వం కుండబద్దలు కొట్టినట్లు చెప్పింది. విశాఖ సినీ పరిశ్రమకు అన్ని విధాలా అనుకూలంగా వుండే నగరం. హైదరాబాద్ నుండి పూర్తిగా కాకున్నా పాక్షికంగా సినీ పరిశ్రమను విశాఖకు తరలించేందుకు ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి చొరవచూపాలి.

**బోయిన ఉమామహేష్, నెల్లూరు.**

## విమర్శలు ఆపండి

ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కాని, అధికారంలోకి వచ్చిన తర్వాత గాని వైసిపి నేతలు రాష్ట్రంలో ఏం జరిగినా దానికి కారణం చంద్రబాబే నంటూ విమర్శిస్తున్నారు. వారి పని తీరు ప్రజామోదంగా లేదనిపిస్తోంది. ఇకనైనా విమర్శలు మాని అభివృద్ధిపై దృష్టిపెడితే బాగుంటుంది.

**జెయస్ కృష్ణ, నెల్లూరు.**

# రాజధానిగా ఓకే...
# రవాణాయే సమస్య

## ● రైళ్ళు, బస్సులు పెంచాలి




రాష్ట్ర రాజధానిగా అమరావతి వుండాలా? లేక విశాఖ పట్నం వుండాలా? అనేదానిపై జిల్లా ప్రజలలో పెద్దగా స్పందన లేదు. అసలు రాజధాని అంశాన్నే ప్రజలు పట్టించుకోవడం లేదు. ఎందుకంటే సామాన్య ప్రజలకు రాజధానితో అవసరాలు చాలాతక్కువ. తొలిదశలో ప్రజాప్రతినిధులు, బడా కాంట్రాక్టర్లు, పారిశ్రామికవేత్తలు, ఉన్నతాధికారులకు మాత్రమే అవసరం వుంటుంది. రాజధాని ఎక్కడున్నా వీళ్ళకు పోవడం పెద్ద కష్టమేమీ కాదు. అమరావతిలో వుంటే రైళ్లు, కార్లలో పోతారు, విశాఖపట్నం అయితే తిరుపతి కెళ్లి విమానంలో పోతారు. అమరావతిలో రాజధాని వున్నప్పుడు మాత్రం జిల్లాలో ఎవరికైనా పనుంటే పొద్దున్నే వెళ్లి సాయంత్రంకల్లా తిరిగొస్తుండేవాళ్ళు. ఇప్పుడు విశాఖపట్నం అయితే అలా కాదు, నెల్లూరుకు 600పై చిలుకు కిలోమీటర్ల దూరంలో వుంది. రాజధాని దూరమా, దగ్గరా అన్నది పెద్ద సమస్య కాదు. రవాణా వసతులు ఎంత అందుబాటులో వున్నాయన్నది ముఖ్యం.

ఐదేళ్ల క్రితం దాకా హైదరాబాద్ మన రాజధాని. నెల్లూరు నుండి విమాన సౌకర్యం లేకపోయినా, రోడ్డు, రైలు వసతి బాగానే వుండేది. రాత్రి ఇక్కడ బయలుదేరితే ఉదయానికి అక్కడకు చేరేలా ఐదు ఎక్స్‌ప్రెస్ రైళ్లు అందుబాటులో వున్నాయి. ఇవే గాక రోజు మొత్తంలో రైళ్లు తిరుగుతుంటాయి. నెల్లూరు నుండి ప్రతిరోజూ వందకుపైగా ఆర్టీసీ, ప్రైవేట్ బస్సులు హైదరాబాద్ పోతుంటాయి. రైలు కంటే రోడ్డు ప్రయాణం ఇటీవల కాలంలో తక్కువ టైం పడుతుండడం చూస్తున్నాం. నెల్లూరు నుండి విశాఖకు ఆ విధమైన రవాణా వ్యవస్థ లేదు. రాత్రివేళ విశాఖ వెళ్లాలంటే తిరుమల ఎక్స్‌ప్రెస్ ఒక్కటే వుంది. అది కూడా రాత్రి ఇక్కడ 11గంటలకు ఎక్కితే పక్కరోజు మధ్యాహ్నానికి విశాఖపట్నం చేరుకుంటుంది. ఇంకొన్ని రైళ్లు వున్నా వాటి వేళలు సరిగా లేవు. కాబట్టి నెల్లూరు, ప్రకాశం, గుంటూరు జిల్లాల నుండి రాజధానికి కనెక్టివిటి పెంచుతూ తిరుపతి విశాఖ, లేదా చెన్నై-విశాఖల మధ్య రెండు మూడు కొత్త రైళ్లను వేయాలి.

నెల్లూరు నుండి విశాఖపట్నంకు బస్సు సౌకర్యం కూడా అంతంత మాత్రమే. ప్రతిరోజూ ఆర్టీసీ వాళ్లవి రెండుబస్సులే వున్నాయి, అవి కూడా విశాఖ డిపోవి. అలాగే ప్రైవేట్ ట్రావెల్స్‌కు చెందినవి ఇంకొన్ని బస్సులు విశాఖకు వెళుతుంటాయి. బస్సు రవాణా సౌకర్యాన్ని కూడా మెరుగుపరచాల్సివుంది. అన్నింటికి మించి దామవరం ఎయిర్‌పోర్టును తొందరగా పూర్తిచేసి విశాఖకు విమాన ప్రయాణం కల్పిస్తే దానంత సుఖం ఇంకోటి వుండదు.



# టెన్షన్.. రిజర్వేషన్

## ● ఆశావహుల్లో ఉత్కంఠ

నెల్లూరు నగరపాలక సంస్థ మేయర్... నగరంలో మూడో పవర్ సెంటర్ అని చెప్పవచ్చు. నెల్లూరు నగర, రూరల్ ఎమ్మెల్యేలు రెండు పవర్ కేంద్రాలైతే, మేయర్ ఇంకో పవర్ కేంద్రం. అయితే ఈ ఇద్దరు ఎమ్మెల్యేలకు కూడా మేయర్ కేంద్రం ఎంతో కీలకం. ఈ రెండు నియోజకవర్గాల ప్రజలకు ఎమ్మెల్యేలతో కంటే కూడా నగర పాలకసంస్థలోనే ఎక్కువ పనులుంటాయి. కాబట్టే గతంలో మాజీఎమ్మెల్యే స్వర్గీయ ఆనం వివేకానందరెడ్డి మూడుసార్లు ఎమ్మెల్యేగా చేసినా కూడా మున్సిపాలిటీ, ఆ తర్వాత కార్పొరేషన్‌పై తన పట్టును నిలబెట్టుకోవడానికి ప్రయత్నించేవాడు. తన మనుషులను మేయర్ కుర్చీలో వుంచడానికి ప్రయత్నించాడు. నెల్లూరు కార్పొరేషన్ తొలిమేయర్ పులిమి శైలజతో ఆయనకు విభేదాలొచ్చాకే మేయర్ పదవి చేతిలో లేకపోతే ఎంత కష్టమో ఆయనకు తెలిసొచ్చింది. అందుకే పట్టుబట్టి పులిమి శైలజను దించేసి తనకు అనుకూలంగా వ్యవహరించే భానుశ్రీని మేయర్ చేశాడు. మొన్న ఐదేళ్ల తెలుగుదేశం పాలనలో మేయర్‌గా అజీజ్ వుండడం తెలిసిందే! అయితే నెల్లూరులో ఇద్దరు ఎమ్మెల్యేలు వైసిపివాళ్ళు కావడంతో ఆధిపత్య పోరాటాలేమీ జరగలేదు. ఇప్పుడు రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం వుంది. నగర, రూరల్ ఎమ్మెల్యేలిద్దరూ వైసిపి వాళ్ళే! అంతేకాదు, నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యాదవ్ మంత్రి కూడా! రేపు కార్పొరేషన్ ఎన్నికలు జరిగితే మేయర్ కుర్చీని గెలవడం వైసిపికి పెద్ద సమస్య కాదు. కాకపోతే రేపు మేయర్ కుర్చీ ఎవరికి దక్కనుందన్నది పెద్ద ప్రశ్నార్ధకంగా మారింది.

ప్రస్తుతం రిజర్వేషన్‌ల వ్యవహారం నాయకులకు పెద్ద టెన్షన్‌గా మారింది. మేయర్ కుర్చీ మీద నగర, రూరల్ నియోజకవర్గాలకు చెందిన పలువురు నాయకులు ఆశలు పెంచుకునివున్నారు. జనరల్ అయితే గతంలో డిప్యూటీ మేయర్‌గా పనిచేసిన ముక్కాల ద్వారకానాథ్ తనకు అవకాశం వస్తుందనుకుంటున్నాడు. బిసి జనరల్ వస్తే పార్టీ నాయకుడు పి.రూప్‌కుమార్‌యాదవ్ లైన్‌లో వున్నాడు. అలాగే నెల్లూరు రూరల్‌కు చెందిన మరో నాయకుడి పేరు కూడా మేయర్ పదవికి వినిపిస్తోంది. ముందుగా రిజర్వేషన్ వచ్చేదాన్ని బట్టే వీళ్ల ఆశలు సాకారమయ్యే అవకాశాలుంటాయి. జడ్పీ ఛైర్మెన్ పదవి మీద చాలామంది నాయకులు ఆశలు పెట్టుకుంటే అది పుటుక్కున ఎస్టీ రిజర్వ్ అయ్యింది. రేపు మేయర్ కుర్చీ కూడా ఎస్టీకో ఎస్సీకో రిజర్వయితే వీరి ఆశలన్నీ అడియాశలే! అప్పుడు డిప్యూటీమేయర్‌కు డిమాండ్ పెరుగుతుంది. ఏదైనా రిజర్వేషన్ తేలేదాకా వీళ్లకు టెన్షన్ తప్పదు.



# కలెక్టర్ కన్నెర్ర

## రెడ్‌క్రాస్ పట్ల అసహనం

దేశంలోనే నెల్లూరు జిల్లా రెడ్‌క్రాస్ సంస్థకి మంచి పేరున్నప్పటికీ ఇప్పటిదాకా పనిచేసిన కమిటీ పనితీరు సరిగా లేదని, నిర్వహణ బాగా లేదని జిల్లా కలెక్టర్ ఎంవి శేష గిరిబాబు అసంతృప్తి వ్యక్తం చేశారు. మంచితో పాటు లోపాలు కూడా ఉన్నాయని స్పష్టం చేశారు.

ఈ నెల 4న ఆయన నెల్లూరులోని రెడ్‌క్రాస్ కార్యాలయంలో జరిగిన రెడ్‌క్రాస్ సొసైటీ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతూ రెడ్‌క్రాస్ నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పారదర్శకత లోపించిందని, అనేక అంశాల్లో నిర్ధిష్టమైన విధానాలు లేవని మండిపడ్డారు. ఎక్కువ సంఖ్యలో కొత్త సభ్యులను చేర్చాలని తాను రెడ్‌క్రాస్ కమిటీని పదేపదే కోరాల్సివచ్చిందని, అదేవిధంగా ఒక వెబ్‌సైట్ ప్రారంభించి అందులో రెడ్‌క్రాస్ కార్యక్రమాలు, లావాదేవీలన్నింటినీ పొందుపరచాలని పలుమార్లు చెప్పినా కమిటీ స్పందించలేదని అన్నారు. అందువల్ల తానే బాధ్యత తీసుకుని వెబ్‌సైట్ ఏర్పాటు చేస్తానన్నారు. ఈ వెబ్‌సైట్‌లో గతంలో సభ్యులు చేసిన సేవా కార్యక్రమాలు, ప్రస్తుతం సాధించిన ప్రగతి, జరుగుతున్న పనితీరు ప్రదర్శించడం జరుగుతుందన్నారు. సభ్యులు అనుమానాలపై ప్రశ్నిస్తే నాయకులు సమాధానం చెప్పాలన్నారు. గ్రూపులు కట్టడం మానుకోకపోతే కఠినచర్యలు తప్పవని, అందరూ కలసికట్టుగా ఉండి ఏకగ్రీవంగా నూతన కమిటీని ఎన్నుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో రెడ్‌క్రాస్ పరిధిలో ఉన్న 11 విభాగాల గురించి ఆడిట్ లెక్కలపై సభ్యులు వాగ్వాదానికి దిగారు. ఇచ్చిన లెక్కల్లో పొంతన కుదరని ప్రశ్నలెన్నో ఉన్నాయని సభ్యులు అంకయ్యచౌదరి, మురళీకృష్ణ తదితరులు నిలదీశారు. సభ్యుడు బయ్యా ప్రసాద్ కమిటీ గడువు ముగిసి ఏడాదైనా ఎన్నికలు ఎందుకు నిర్వహించలేదని ప్రశ్నించారు. చిరంజీవి యువత జాతీయ ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ రెడ్‌క్రాస్‌కు వేలాదియూనిట్ల రక్తాన్ని స్వచ్ఛంధంగా అందిస్తుంటే కనీస గౌరవం కూడా ఇవ్వడం లేదని వాపోయాడు. క్యాన్సర్ ఆసుపత్రి సాధన పోరాటకమిటీ సభ్యుడు డాక్టర్ దత్తాత్రేయులు నెల్లూరులో క్యాన్సర్ ఆసుపత్రి నిర్మాణానికి కేంద్రప్రభుత్వం అనుమతించిందని, దీని ఏర్పాటుకు అందరూ సహకరించాలని కోరారు. బ్లడ్ బ్యాంక్ కన్వీనర్ డాక్టర్ సుబ్బారావు మాట్లాడుతూ రెడ్‌క్రాస్‌లో 5174 మంది సభ్యులున్నారని, వీరిలో అనేకమంది ఎన్నికలు నిర్వహించాలని కోరారని, ఈ విషయాన్ని తాను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తామని అన్నారు.

అనంతరం ఎన్నికలను వాయిదా వేశారు. ఎప్పుడు నిర్వహించాలనేది కలెక్టర్ నిర్ణయించనున్నారు. ఈ కార్యక్రమంలో డిసిఓ తిరుపాల్‌రెడ్డి, రెడ్‌క్రాస్ రాష్ట్ర పరిశీలకులు కోటయ్య, కార్యదర్శి మస్తానయ్య, మాజీ ఛైర్మెన్ డాక్టర్ ఏవి సుబ్రహ్మణ్యం, సామాజికవేత్త చలమయ్య తదితరులు పాల్గొన్నారు.

# డయాలసిస్ బాధితునికి ఆదాల సాయం



కోవూరుకు చెందిన పి.రాజారావు అనే డయాలసిస్ పేషంట్‌కు ఆదాల ప్రభాకర్‌రెడ్డి పదివేల రూపాయల ఆర్ధిక సాయం అందించాడు. డయాలసిస్ చేయించుకోవడానికి వారు పడుతున్న ఆర్ధిక ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఆదాల స్పందించి ఈ సాయం అందించాడు.

# భరత్‌కు కమలం పగ్గాలు



భారతీయ జనతాపార్టీ జిల్లా అధ్యక్ష పదవి గుండ్లపల్లి భరత్‌కుమార్‌ను వరించింది. కావలికి చెందిన భరత్‌కుమార్ గతంలో కౌన్సిలర్‌గానూ, వైస్‌ఛైర్మెన్‌గానూ, ఇన్‌ఛార్జ్ ఛైర్మెన్‌గానూ పనిచేశారు. పార్టీలో వివిధ హోదాలలోనూ పనిచేశాడు. పార్టీ సిద్ధాంతాల పట్ల చిత్తశుద్ధిగల నాయకుడిగా పేరుంది. బీజేపీ జిల్లా అధ్యక్ష పదవి కోసం ఈసారి 11మందిదాకా దరఖాస్తు చేసుకున్నారు. అయితే అధ్యక్ష ఎంపిక బాధ్యతను దగ్గుపాటి పురంధరేశ్వరి, ఎమ్మెల్సీ మాధవ్, మాజీఎమ్మెల్యే వేములు పర్యవేక్షించి అందరి అభిప్రాయాలు తీసుకుని అధిష్టానానికి నివేదించారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు జిల్లాకు చెందిన పార్టీ సీనియర్ నాయకులు పి.సురేంద్రరెడ్డి, కర్నాటి ఆంజనేయరెడ్డి లతోనూ అధ్యక్షుని ఎంపికపై చర్చించి చివరకు బలహీనవర్గాలకు చెందిన భరత్‌కుమార్‌ను అధ్యక్ష పదవికి ప్రకటించారు.

ఇక ఇప్పటివరకు అధ్యక్షుడిగా పనిచేసిన పి.సురేంద్రరెడ్డి పార్టీ అధ్యక్షులుగా పనిచేసిన వారిలో అత్యధిక కాలం(11ఏళ్ళు) పనిచేసిన రికార్డును సొంతం చేసుకున్నాడు. ఆయన కాలంలోనే జిల్లాలో పార్టీకి విజయాలు లేకున్నా దేశ వ్యాప్తంగా ఘన విజయాలు సాధించిన అనుభూతి మిగిలింది.



## శ్రీరంగనాథుని దర్శించుకున్న
# దేవాదాయ మంత్రి శ్రీనివాస్

రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ ఈనెల 4న నెల్లూరులోని రంగనాయకుల పేటలో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ రంగనాథ స్వామిని దర్శించుకున్నారు. ఆలయ ఇ.ఓ వేమూరి గోపి, దేవస్థానం ధర్మకర్తల మండలి ఛైర్మెన్ కోట గురుబ్రహ్మం, సభ్యులు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయ ప్రధాన అర్చకులు కిడాంబి జగన్నాధాచార్యులు, నిశింద సుదర్శనా చార్యులు మంత్రికి ఆలయ ప్రాశస్త్యాన్ని వివరించారు. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని మంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు. మాజీ డిప్యూటీ మేయర్ ముక్కాల ద్వారకానాథ్, దేవాదాయశాఖ సహాయ కమిషనర్ వేగూరు రవీంద్రరెడ్డి పాల్గొన్నారు.

# డిసిసిబి క్యాలెండర్ ఆవిష్కరణ

జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ 2020 నూతన సంవత్సర క్యాలెండర్‌ను బ్యాంక్ ఛైర్మెన్ ఆనం విజయకుమార్‌రెడ్డి ఈనెల 4న ఆవిష్కరించారు. బ్యాంక్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ కొత్త సంవత్సరంలో బ్యాంక్ లాభాల బాటలో పయనించే విధంగా అధికారులు, సిబ్బంది అందరూ కృషి చేయాలన్నారు. జిల్లాలోని రైతులకు మెరుగైన సేవలు అందించాలని, బ్యాంక్ అభివృద్ధికి దోహదపడేవిధంగా విధులు సక్రమంగా నిర్వహించాలని కోరారు. బ్యాంక్ సిఇఓ వెంకట రమణారెడ్డి, డిజిఎంలు సరిత, ఉషారాణి, నాగేంద్ర కుమార్, ఏజిఎం దయాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

## టిసిఎస్‌కు ఏడుగురు..
# కృష్ణచైతన్య విద్యార్థులు



నెల్లూరులోని కృష్ణచైతన్య కళాశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థ టిసిఎస్‌కు ఎంపికయ్యారు. గతనెల 21న హైదరాబాద్‌లో ఈ సంస్థకు ఎంపికలు జరగ్గా, తమ కళాశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు అందులో చోటు దక్కించుకున్నారు... అర్హత సాధించారని కళాశాల డైరెక్టర్లు చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణారెడ్డిలు పేర్కొన్నారు. ఈనెల4న కళాశాలలో జరిగిన కార్యక్రమంలో వారు ఆ విద్యార్థులను అభినందించారు. కళాశాల డీన్ సుధారాణి, ప్రిన్సిపల్స్ కృష్ణకుమార్, నాగయ్య పాల్గొన్నారు.

# ఫ్రీజర్ వితరణ

నెల్లూరు రూరల్ నియోజకవర్గం కొత్తూరులోని హెచ్‌ఆర్ కల్యాణ మండపంలో ఈనెల 5న అంతిమ సంస్కారాలు నిర్వహించేందుకు వీలుగా శీతల బాక్స్ (ఫ్రీజర్)ను సింహపురి యువశక్తి సేవాసమితి అధ్యక్షుడు బెజవాడ మేఘనాథ్‌సింగ్ ఉచితంగా పేదలకు అందించేందుకు వితరణ చేశారు. ఈ సందర్భంగా నెల్లూరు నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ గోపీకృష్ణ, మెప్మా పీడీ రమేష్, నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కార్యాలయం ఇన్‌చార్జి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి మేఘనాథ్ సింగ్ సేవానిరతిని కొనియాడారు. సింహపురి యువశక్తి సేవా నిరతి కార్యక్రమాల్లో భాగంగా 33,34,35వ డివిజన్ల ప్రజలకు అందు బాటులో ఉండేలా శకటాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు మేఘనాథ్ సింగ్ తెలిపారు.

## జాతీయ పోటీలకు ఎంపికైన
# త్రిపుర నిఖిత

యువజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి సందర్భంగా జాతీయ యువజనోత్సవాల్లో భాగంగా విశాఖపట్నంలో జరిగిన రాష్ట్ర స్థాయి శాస్త్రీయ, జానపద,నృత్య, సంగీత, సాహిత్య పోటీల్లో కథక్ విభాగంలో నెల్లూరు జిల్లా నుంచి త్రిపుర నిఖిత ప్రథమస్థానంలో నిలిచి జాతీయ పోటీలకు ఎంపికైందని యువజన సంక్షేమ శాఖ సీఇవో ఎం. సుస్మితారెడ్డి తెలిపారు. ఈనెల 12 నుంచి 16 వ తేదీ వరకు లఖ్‌నవూలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో త్రిపుర నిఖిత పాల్గొననుందని ఈ సందర్భంగా ఆమెను అభినందించారు.

## రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు
# నెల్లూరు జిల్లా జట్టు

నెల్లూరు జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా జట్టును ఎంపిక చేశారు. ఈనెల 6 న రాంజీనగర్ లోని శ్రీ చైతన్య స్కూలులో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో నారాయణ వైద్య కళాశాల వైద్యుడు ఇ.మధుసూదనరెడ్డి విజేతగా నిలిచారు. తర్వాత స్థానాల్లో వి.పృథ్వీరెడ్డి, ఎస్.వంశీ కృష్ణ, ఎస్‌కె సమద్, పి.వేణు గెలుపొందారు. ఈనెల 25,26 తేదీల్లో కృష్ణాజిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి చెస్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో వీరు మన జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారని అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి వై.సుమన్ తెలిపారు. టోర్నీ నిర్వాహకులు వి.కిషోర్, ఆర్బిటర్లు రామ్-లక్ష్మణ్, ఆర్గనైజర్లు మహేష్, వెంకటేష్ పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి షటిల్ బ్యాడ్మింటన్‌లో
# విజేత గూడూరు

కోట శివరామయ్య మెమోరియల్ ఆధ్వర్యంలో నెల్లూరులో జరిగిన రాష్ట్రస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు ఈనెల 5న ముగిశాయి. టోర్నమెంట్ విజేతగా గూడూరు జట్టు బషీర్, సాయి నిలిచారు. రన్నర్స్‌గా వైజాగ్ జట్టు చంద్ర గోపీనాథ్, కిరణ్ మౌళీ విజయం సాధించారు. తృతీయ స్థానంలో సుమంత్, అప్పారావు జట్టు, నాలుగవ స్థానంలో సెంథిల్, రాజేష్ జట్టు, అయిదవ స్థానంలో గోవింద్, శ్రీను నిలిచారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కోట సూర్యనారాయణ, అమరా వెంకు, సుకుమార్, హనుమంతరావు, దిలీప్, ఎర్రసూరి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## మాకాని వెంకట్రావుస్వామి
# ద్వితీయ ఆరాధన



భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి ప్రియ శిష్యులు స్వర్గీయ మాకాని వెంకట్రావు స్వామి వారి ద్వితీయ ఆరాధన మహోత్సవం ఈనెల 6న నెల్లూరు మూలాపేట బ్రాహ్మణ వీధిలోని గురునిలయంలో వైభవంగా జరిగింది. ఉదయం నుండి శ్రీ వెంకయ్యస్వామికి, శ్రీ వెంకట్రావుస్వామికి అభిషేకాలు, సహస్రనామార్చనలు, హారతి తదితర కార్యక్రమాలను నిర్వహించారు. మధ్యాహ్నం అన్నసంతర్పణ చేశారు. రాత్రి 7 గంటలకు గురుభగవానుల నగరోత్సవం వైభవంగా సాగింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలను మాకాని వెంకట్రావుస్వామి కుమారుడు మాకాని గోపి, కుటుంబసభ్యులు, ఆయన శిష్యులు నిర్వహించారు.

# నెల్లూరు కబుర్లు

# వివిఎస్‌యు స్నాతకోత్సవం

విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం స్నాతకోత్సవం ఈ నెల 21వ తేదీ నెల్లూరులోని కస్తూర్బా కళాక్షేత్రం నందు జరుగనుంది. ఆగస్టు 25వ తేదీన జరగాల్సిన స్నాతకోత్సవం వాయిదాపడి ఇప్పుడు కుదిరింది. భారత ఉపరాష్ట్రపతి యం.వెంకయ్య నాయుడు ముఖ్యఅతిథిగా విచ్చేసే ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ పాల్గొని విద్యార్థులకు పట్టాలు అందజేయనున్నారు. స్నాతకోత్సవానికి హాజరయ్యే విద్యార్థులు ఒకరోజు ముందుగా యూనివర్శిటీ పరీక్షల నియంత్రణాధికారి కార్యాలయంలో ఎంట్రీపాసులు తీసుకోవాలని యూనివర్శిటీ రిజిస్ట్రార్ అందె ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.

# సిసిఎస్ సిఐగా రామారావు

నెల్లూరు సిసిఎస్ సి.ఐగా జి.రామారావు 6వ తేదీ బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ సి.ఐగా వున్న షేక్ బాజీజాన్ సైదాను జిల్లా హెడ్‌క్వార్టర్‌కు అటాచ్ చేశారు. రామారావు గతంలో జిల్లాలో పలుచోట్ల ఎస్.ఐగా పని చేయడమేకాక నెల్లూరులో విజిలెన్స్ సి.ఐగా, మూడు, నాలుగో నగరాల సి.ఐగా, స్పెషల్ బ్రాంచ్ సిఐగా పనిచేసి వున్నారు.

# బాధ్యతలు తీసుకున్న శేషయ్య

నెల్లూరు ఆర్టీసీ రీజియన్ డిప్యూటీ కమిషనర్ (ఆర్ఎం)గా వెంకటశేషయ్య 7వ తేదీ తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. కడప ఆర్ఎంగా పనిచేస్తూ ఆయన ఇక్కడకు బదిలీ అయ్యారు. నెల్లూరుజిల్లా వాసే అయిన శేషయ్య జిల్లాలోని పలు డిపోలకు మేనేజర్‌గా, డిప్యూటీ సిఎంఇగా సుదీర్ఘ కాలం పనిచేసి వున్నారు.

## పద్య సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో..
# 12న 'విపంచిక' ఆవిష్కరణ

నెల్లూరులో స్వామి వివేకానంద జయంతి రోజున పద్య సారస్వత పరిషత్ నెల్లూరుజిల్లా శాఖ ప్రారంభమైన నేపథ్యంలో ఈనెల 12న ఆ శాఖ ద్వితీయ వార్షికోత్సవాన్ని నిర్వాహకులు ఘనంగా నిర్వహిస్తున్నారు. అదేరోజున స్వామి వివేకానంద జయంతి (యువజనోత్సవం)ని పురస్కరించుకుని నిర్వహించే ఈ కార్యక్రమంలో పద్యకవితలు, సాహిత్య వ్యాసాలతో కూడిన 'విపంచిక' సంచికను ఆవిష్కరించనున్నారు. బాలాజీనగర్‌లోని ఎలమందయ్య బడిలో ఆరోజు ఉదయం 10.30గంటలకు జరిగే సభకు సింహపురి ధార్మిక సంస్థ వ్యవస్థాపకుడు ఉచ్చి భువనేశ్వరి ప్రసాద్ జ్యోతిప్రజ్వలనం చేస్తారు. ప్రపంచ తెలుగు సమాఖ్య రీజనల్ మేనేజర్ నలుబోలు బలరామయ్యనాయుడు సభను ప్రారంభిస్తారు. పద్యభారతి చదలవాడ లక్ష్మీనరసింహారావు 'విపంచిక'ను ఆవిష్కరిస్తారు. శతావధాని డా. సూరం శ్రీనివాసులు పుస్తక సమీక్ష చేస్తారు. ప్రముఖ సాహితీవేత్త పోలవరపు లక్ష్మీనర సింహారావు అధ్యక్షత వహిస్తారు. ప్రధాన కార్యదర్శి డా. చీమకుర్తి వెంకటేశ్వరరావు నివేదిక సమర్పిస్తారు. వివేకానంద పాఠశాల వ్యవస్థాపకులు బొమ్మిశెట్టి యలమందయ్య, మురారిశెట్టి తిరుపతిస్వామి ముఖ్యఅతిథిగా పాల్గొంటారు.

# రైల్వే పాసులు రెన్యూవల్ చేయాలి

జర్నలిస్టులకు ప్రభుత్వం ఆరు నెలలు అక్రిడిటేషన్‌ను పొడిగించిన దృష్ట్యా రైల్వేశాఖ వెంటనే రైల్వే పాసులు రెన్యూవల్ చేయాలని ఏపీయుడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి ఏ.జయప్రకాష్ కోరారు. ఈనెల 3న సామ్నా ఆధ్వర్యంలో నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్ సూపరింటెండెంట్ వి.ఆంథోని జయరాజ్‌కు వినతిపత్రం అందజేశారు. పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

# వదలనంటున్న వర్షాలు



అదేం ఖర్మోగాని చంద్రబాబు ముఖ్యమంత్రిగా వున్నంత కాలం రాష్ట్రాన్ని ఎండలు వదల్లేదు. వర్షాలు కురవాల్సిన నవంబర్, డిసెంబర్ నెలల్లోనూ ఎండలే... మంచు పడాల్సిన జనవరి, ఫిబ్రవరి నెలల్లోనూ ఎండలే. అప్పుడు ఎండలతో జనం అల్లాడిపోతే, జగన్ సీఎం అయిన దగ్గర నుండి రాష్ట్రాన్ని వర్షాలు ముంచెత్తుతున్నాయి. నవంబర్, డిసెంబర్ నెలల్లో వానలు పడ్డాయంటే అర్థముంది... జనవరిలో కూడా నెల్లూరుజిల్లా వాళ్ళను వర్షాలు వదలడం లేదు. జనవరి నెల మొదలైనప్పటి నుండి రోజూ వానలే! వానల దెబ్బకు చలి, మంచు కూడా లేకుండాపోయింది.

# వణికిస్తున్న వ్యాధులు



నెల్లూరు నగరాన్ని సీజనల్ వ్యాధులు వణికిస్తున్నాయి. ముఖ్యంగా డయేరియా విస్తరిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. వాంతులు, విరోచనాలు వ్యాధి ముఖ్యలక్షణం. ఈ లక్షణాలు కనిపించిన వారు వెంటనే వైద్యులను సంప్రదించి తగిన చికిత్స పొందాలి. లేకుంటే కిడ్నీలకు ప్రమాదమే. ఇక విష జ్వరాలు కూడా నగరం నిండా వున్నాయి. డెంగ్యూ, చికున్‌గున్యా, వైరల్ జ్వర పీడితులతో నగరంలోని ఆసుపత్రులు కిటకిటలాడుతున్నాయి. డెంగ్యూ జ్వరాల కేసులు పెరగడంతో ప్లేట్‌లెట్లకు డిమాండ్ ఎక్కువగా వుంది. దోమలు విజృంభించడం, కలుషిత మైన నీళ్ళు, పారిశుద్ధ్యంలో లోపాలు వ్యాధులు ప్రబలడానికి కారణాలుగా కనిపిస్తున్నాయి.

# ముందు 'ప్యాచ్'లు వేయండి



నెల్లూరు నగరంలో రోడ్లు చాలాచోట్ల అధ్వాన్నంగా వున్నాయి. గతంలో భూగర్భడ్రైనేజీ పనులవల్ల కొన్ని రోడ్లు పాడవగా, ఇటీవల కురిసిన వర్షాల వల్ల కూడా కొన్ని ప్రాంతాలలో తారురోడ్లు గుంతలు పడి వాహనదారులకు ఇబ్బంది కలిగిస్తున్నాయి. నగరంలో అన్ని రోడ్లను వేయాలంటే పూర్తిస్థాయిలో బడ్జెట్ మంజూరు కావాలి. దానికి కొంత సమయం పట్టొచ్చు. కాని, గుంతలుపడ్డ చోట్ల ప్యాచ్‌లు వేయడానికి పెద్ద బడ్జెట్ అవసరం లేదు. అది కూడా ట్రంకురోడ్డు, మినీబైపాస్, పొదలకూరురోడ్డు, మాగుంట లే అవుట్ వంటి ప్రధాన రోడ్లలో ముందు ప్యాచ్‌వర్క్‌లు పూర్తి చేయిస్తే బాగుంటుంది. ఇటీవలే కొన్ని రోడ్లకు ప్యాచ్‌లు వేశారు. అయితే ఇప్పుడు పడ్డ వర్షాలకు ఆ ప్యాచ్‌లు ఊడిపోయి వాహనదారులను ఇంకాస్త ఇబ్బందులకు గురిచేస్తున్నాయి.



# ప్రగతికి చిరునామా ప్రసన్న

## ఆదాల అభినందనలు

అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్ కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డేనని నెల్లూరు పార్లమెంటుసభ్యులు ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నాడు. 7వ తేదీన ఆయన నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డితో కలిసి కొడవలూరు మండలం నార్త్‌రాజుపాలెంలో 2.30కోట్ల రూపాయలతో చేపట్టిన 7 అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశాడు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆదాల మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధి కోసం ఆయా ఎంపీల నుండే కాక ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డిని కూడా సంప్రదించి నిధులు మంజూరు చేయించుకున్న ఘనత ప్రసన్నకుమార్‌రెడ్డిదేనన్నాడు. కోవూరు నియోజకవర్గంలో దాదాపు 600 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, నియోజకవర్గం అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని చెప్పాడు. రానున్న నాలుగేళ్లలో జిల్లాలో రెండువేల కోట్లతో ఇరిగేషన్ పనులు పూర్తికానున్నాయని వెల్లడించాడు. ఈ కార్యక్రమంలో విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, డిసిఎంఎస్ ఛైర్మెన్ వీరి చలపతి, వైసిపి నాయకులు స్వర్ణ వెంకయ్య, పి.కోటేశ్వరరెడ్డి, మల్లు సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

## టీడీపీ నాయకులు

# తప్పుడు ప్రచారాలు మానుకోవాలి

ఎన్‌ఆర్‌సీ, ఎన్‌పీఆర్, సీఏఏ చట్టాలపై తెలుగుదేశం పార్టీ నాయకులు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని మానుకోవాలని వైకాపా జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు సయ్యద్ హమ్జా హుస్సేనీ కోరాడు. ఈనెల 5న నెల్లూరు మాగుంట లేఅవుట్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ టీడీపీ నాయకులు షేక్ అజీజ్ ఎన్‌ఆర్‌సీ, ఎన్‌పీఆర్ జీవో నెంబరు 102పై వైకాపా ప్రభుత్వ విధానంపై లేనిపోని అసత్యాలు మాట్లాడుతూ ముస్లీం సోదరులను తప్పుదారి పట్టిస్తున్నారని మండిపడ్డాడు. ఇటీవల అజీజ్ కేంద్ర ప్రభుత్వం ప్రతి పదేళ్ళకు జనగణన కోసం ప్రవేశ పెట్టిన ఎన్‌పీఆర్‌కి అనుబంధంగా ఇచ్చిన జీవో 102ను సీఎం జగన్ ప్రవేశ పెట్టినట్లు అది ముస్లీం వ్యతిరేకమైనట్లు మీడియా ప్రతినిధుల ముందు జీవో కాపీని చించి అద్భుతంగా నటించారన్నారు. మహమద్ రవూఫ్, ఆలీ తదితరులు పాల్గొన్నారు.



ఈ నెల 4వ తేదీ నెల్లూరులో అఖిల గాండ్ల, తెలికుల సంక్షేమ సంఘం నెల్లూరు జిల్లా వారి 2020 క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఆ సంఘం అధ్యక్షులు గ్రోసు గోపాలయ్య. కార్యక్రమంలో కార్యదర్శి తిరుపతి హరగోపాల్, కోశాధికారి వరిగొండ సురేష్ బాబు, వీరిశెట్టి హజరత్ బాబు, చాకిరాల శేషయ్య, చిట్టెంశెట్టి సుధాకరరావు పాల్గొన్నారు.

## 'ఆపరేషన్ ముస్కాన్'తో..

# బాలల బంధనాలు తెంచాం!

## - జిల్లా ఎస్పీ భాస్కర్ భూషణ్ వెల్లడి



అనాధలు, తల్లిదండ్రుల నుంచి తప్పిపోయిన వారు, పోషణకు భారమై ఇంటినుంచి పారిపోయి ఫ్యాక్టరీలు, హోటళ్ళు, రైలు, బస్టాండ్‌లలో పనిచేస్తున్న బాలలను గుర్తించి వారిని అక్కునచేర్చుకున్నారు పోలీసులు. నెల్లూరు నగరంలో 103 మంది బాలురు, 15 మంది బాలికలు, నెల్లూరు రూరల్ సబ్‌డివిజన్లో 84 మంది బాలలు, 11 మంది బాలికలు, అదేవిధంగా గూడూరులో 73 మంది బాలురు, అయిదుగురు బాలికలు, కావలి సబ్‌డివిజన్లో 43 మంది బాలురు, ఆత్మకూరులో 57 మంది బాలబాలికలు, మహిళా పోలీస్‌స్టేషన్, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో మరో ఏడుగురికి విముక్తి కల్పించారు. ఈనెల4న జిల్లా ఎస్పీ భాస్కర్‌భూషణ్ నగరంలోని ఉమేష్‌చంద్ర సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ, చిన్నారుల అభ్యున్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వం 'అమ్మ ఒడి' వంటి ఎన్నో రకాల సంక్షేమ కార్యక్రమాలను చేపట్టిందని, తల్లిదండ్రులు తమకెన్ని కష్టాలున్నా బిడ్డలను చదివించుకోవాలే తప్ప బాలకార్మికులుగా వారిని మార్చకూడదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఒక చిన్నారి తాను ఇకపై ఎలాంటి పనులకు వెళ్ళనని, చదువుకుంటానని ఎస్పీకి చెప్పడంతో వెంటనే ఆయన స్పందించి ఆ బాలిక చదువు కునేందుకు తగు ఏర్పాట్లు చేయాల్సిందిగా సిడబ్ల్యూసీ సభ్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో నగర, ట్రాఫిక్ డిఎస్పీలు శ్రీనివాసులురెడ్డి, మల్లికార్జునరావు, నగర ఇన్స్‌పెక్టర్లు మధుబాబు, రాములునాయక్, మిద్దె నాగేశ్వరమ్మ, సుబ్బారావు, ఆంజనేయరెడ్డి, రూరల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులురెడ్డి, ఎస్‌ఐలు రవినాయక్, బలరామయ్య, రమేష్‌బాబు, నాగభూషణం, నాగార్జునరెడ్డి, మస్తానయ్య, సిడబ్ల్యుసి ఛైర్మెన్ సురేఖ, జెజె బోర్డు సభ్యుడు జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.




స్వర్గీయ సోమిరెడ్డి హైమావతమ్మ గారు
W/o. కీ॥శే॥ సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి
జననం: 1938 మరణం: 15-01-2014

మాతృదేవోభవ

ఆప్యాయతానురాగాలు పంచిన అమృతమూర్తి
మా ఇంటి ఆరాధ్యదైవం, మా తల్లిగారైన
శ్రీమతి సోమిరెడ్డి హైమావతమ్మ గారు
మమ్ము వీడి దైవసన్నిధికి చేరి ఆరేళ్ళు గడవనున్న సందర్భంగా
ఆ పుణ్యమూర్తిని స్మరించుకుంటూ...

కన్నీటి నివాళులతో...

కుమారుడు - కోడలు: సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి - జ్యోతి
మాజీ మంత్రివర్యులు, తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు

కుమార్తెలు - అల్లుళ్ళు
కట్టంరెడ్డి రాణీసంయుక్త - రాధాకృష్ణారెడ్డి
కేతిరెడ్డి ఉషారాణి - రామకోటారెడ్డి

| మనుమలు | మనుమరాండ్రు | మునిమనుమలు | మునిమనుమరాండ్రు |
|---|---|---|---|
| సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి | శ్రుతి | యల్లా శర్విన్ | యల్లా సంజన |
| డా॥ సోమిరెడ్డి అర్జున్‌రెడ్డి | డా॥ లక్ష్మీ ఐషిత | కేతిరెడ్డి శ్రీమన్ | సోమిరెడ్డి శివాని |
| నిమ్మ కౌశిక్‌రెడ్డి | డా॥ సింధు | నిమ్మ ధీర్ | కేతిరెడ్డి శ్రితిక |
| సన్నారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి | నీలిమ | కేతిరెడ్డి శ్రీవంత్ | కట్టంరెడ్డి శ్రీశాన్వి |
| యల్లా సనత్‌రెడ్డి | షాలిని | సన్నారెడ్డి రాయల్ భార్గవ్ | కట్టంరెడ్డి హవిష |
| డా॥ కేతిరెడ్డి కళాధర్‌రెడ్డి | డా॥ మాలిని | నిమ్మ నరేన్ | సన్నారెడ్డి నిరుక్తలేఖ |
| కేతిరెడ్డి శశిధర్‌రెడ్డి | కీర్తి | సోమిరెడ్డి రణదేవ్ | సోమిరెడ్డి అమైరా |
| కట్టంరెడ్డి విక్రమ్‌రెడ్డి | స్నిగ్ధ | | |



## పక్షుల పండుగ..

# సందడే సందడి!



### పరవశించిన పులికాట్ తీరం పులకించిన పర్యాటకులు

***రంగురంగుల విదేశీ విహంగాల విన్యాసాలతో, రకరకాల పక్షుల కేరింతలతో పులికాట్ తీరం పరవశించిపోయింది. రమణీయమైన ప్రకృతి సోయగాలతో, పక్షుల కిలకిలారావాల సందడితో పర్యాటకులు పులకించిపోయారు.***

జిల్లాలోని సూళ్ళూరుపేట కేంద్రంగా ఈనెల 3,4,5 తేదీల్లో ఎంతో సందడిగా జరిగిన ఫ్లెమింగో ఫెస్టివల్-2020 (పక్షుల పండుగ) సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎంవి శేషగిరిబాబు, సూళ్ళూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆధ్వర్యంలో జిల్లా యంత్రాంగం ఈ పండుగకు పటిష్టమైన ఏర్పాట్లు చేసింది. రాష్ట్ర అటవీశాఖమంత్రి బాలినేని శ్రీనివాస్‌రెడ్డి, పర్యాటక మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాస్, పరిశ్రమల మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి, నీటిపారుదల మంత్రి అనిల్‌కుమార్‌యాదవ్, నగరి ఎమ్మెల్యే, ఏపిఐఐసి ఛైర్మెన్ ఆర్‌కె రోజా, గూడూరు ఎమ్మెల్యే వరప్రసాద్ తదితరులు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. హైకోర్టు జడ్జి జస్టిస్ శ్యామ్ ప్రసాద్ తదితర ప్రముఖులు పాల్గొని బైనాక్యులర్స్‌తో పక్షుల సోయగాలను వీక్షించారు. రాష్ట్ర పండుగగా కూడా గుర్తింపును తెచ్చుకున్న ఈ ఫ్లెమింగో ఫెస్టివల్‌ను నాయకులు, అధికారులు అందరూ కలసి జయప్రదం చేశారు. వేలాదిమంది చిన్నారులు, విద్యార్థులు, పెద్దసంఖ్యలో పర్యాటకులు, ప్రజలు ఈ పండుగ సంబరాల్లో పాల్గొన్నారు.

### ఎటు చూసినా పక్షుల కిలకిలారావాలే



పక్షులు విడిదిచేస్తున్న పలు ప్రాంతాలు పక్షుల కిలకిలారావాలతో, వాటిని తిలకించి కేరింతలు కొట్టే చిన్నారులతో మారుమ్రోగాయి. సూళ్ళూరుపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఈ సందర్భంగా పెద్దఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలు, ఎగ్జిబిషన్ స్టాల్స్ ఏర్పాటుచేశారు. పక్షులు విడిదిచేస్తున్న పులికాట్, దొరవారిసత్రం మండలంలోని నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రం, తడ మండలంలోని భీములవారిపాలెం పడవల రేవుల వద్దకు జనం పెద్దసంఖ్యలో తరలివచ్చి గుంపులు గుంపులుగా విహరిస్తున్న పక్షుల అందాలను తిలకిస్తూ ఆనందించారు. శ్రీహరికోట- సూళ్ళూరుపేట మార్గంలో రోడ్డుకు ఇరువైపులా, అటకానితిప్ప-పేర్నాడు రోడ్డు, అటకానితిప్ప-వేనాడు మార్గమధ్యంలో పెద్దసంఖ్యలో పక్షుల విహారం పర్యాటకుల మనసుల్లో ప్రగాఢమైన ముద్ర వేసింది. ఫ్లెమింగో పక్షులు పెద్దసంఖ్యలో విహరిస్తుండడం చూసి పర్యాటకులు ఆనందపరవశులయ్యారు. అనేకమంది కెమెరాల్లో, ఫోన్లలో వాటి సోయగాలను చిత్రీకరించుకున్నారు. అటకానితిప్పలోని పర్యావరణ విజ్ఞానకేంద్రంలో అధికారులు ఏర్పాటు చేసిన పక్షులకు సంబంధించిన ఫిల్మ్‌షోలు సందర్శకులను కనువిందు చేశాయి. భీములవారిపాలెం పడవల రేవు వద్ద ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలను కూడా సందర్శకులు ఆసక్తితో తిలకించారు. జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లాస్థాయిలో క్రీడాపోటీలు నిర్వహించారు.

### ఉర్రూతలూగించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రముఖ సినీ హీరోయిన్ నివేదా సేతురాజ్, ప్రముఖ సినీ నటీమణులు పాయల్ రాజ్‌పుత్, హెబ్బాపటేల్ తదితరులతో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను ఉర్రూతలూగించాయి. ప్రముఖ టీవీ యాంకర్లు విష్ణుప్రియ, దీప్తి, హరితేజల మాటలు సందర్శకులను అలరించాయి. బాబాషరీఫ్ మిమిక్రీ, రాజమౌళి, కార్తీక్, శాంతికుమార్, సుధాకర్, తన్మయ్, జబర్దస టీమ్ కామెడీ స్కిట్స్, కార్తీక్ బృందం భరతనాట్యం, హేమచంద్ర, దనుంజయ, మోహన్, భోగరాజ్, దామినిల పాటకచ్చేరీ, హాట్ స్టెప్పర్స్ డ్యాన్స్ టీమ్, లైవ్ బ్యాండ్, శివనాగులు అండ్ టీమ్ ఫోక్‌డ్యాన్స్ తదితర కార్యక్రమాలన్నీ మోతమోగించాయి.

## గూడూరు డివిజన్ వార్తలు

# ఫోటోగ్రాఫర్ల సమస్యలు తీరుస్తాం

**- ఎమ్మెల్యే వరప్రసాద్**



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ఫోటో వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

ఫోటో, వీడియోగ్రాఫర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి వాటిని పరిష్కరించేలా తగు చర్యలు తీసుకుంటామని గూడూరు ఎమ్మెల్యే వరప్రసాద్ అన్నారు. గూడూరు పట్టణంలోని షాదీమంజిల్ ప్రాంగణంలో ఈనెల 5న గూడూరు టౌన్ అండ్ రూరల్ ఫోటో, వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారోత్సవం సిఐ దశరధరామారావుతో కలసి నిర్వహించారు. తొలుత ఎమ్మెల్యే, అసోసియేషన్ నాయకులు జ్యోతి వెలిగించారు. సిఐ దశరధరామారావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరి జీవితంలో ఫోటోలు మధురజ్ఞాపకమన్నారు. అనంతరం నూతన కార్యవర్గప్రమాణ స్వీకారం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి శ్రీధర్, ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, జిల్లా ఉపాధ్యక్షుడు ఖాజామొహిద్దీన్, అసోసియేషన్ ముఖ్య సలహాదారుడు ఎం.చిరంజీవిగౌడ్, అధ్యక్షుడు బి.సుధాకర్, ఉపాధ్యక్షుడు యస్‌కె అల్తాఫ్, కార్యదర్శి పి.గణేష్, సహాయకార్యదర్శి పెంచల నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

# అమరావతిని కాపాడుకోవాలి



జేఏసిగా ఏర్పడిన వివిధ పార్టీల నాయకులు, ప్రతినిధులు

రాజధాని అమరావతిని కాపాడుకోవాలంటూ గూడూరు పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో వివిధ పార్టీలు, సంఘాలు ఈనెల 6న మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో జేఏసిగా ఏర్పడ్డాయి. ఈ కార్యక్రమంలో అన్నివర్గాలు కలసి జేఏసిగా ఏర్పడినట్లు ఆయన చెప్పారు. అమరావతిని రాజధానిగా ప్రకటించినప్పుడు వైయస్ జగన్మోహన్‌రెడ్డి అంగీకరించారని గుర్తుచేశారు. అమరావతిని రాజధానిగా ఉంచాలంటూ రైతులు రోడ్లమీదికి వచ్చి దీక్షలు చేస్తున్నా ఇప్పుడు ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. రాజధానిగా అమరావతిని ప్రకటించేవరకు అందరం ఐక్యంగా కలసి పోరాడుతామన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసి నాయకులు పులిమి శ్రీనివాసులు, కొండూరు వెంకటేశ్వర్లురాజు, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, కాలేషా, కుమార్, చెంచురామయ్య, శివకుమార్, ఇజ్రాయెల్ కుమార్, ముర్తాజా తదితరులు పాల్గొన్నారు.



దివిపాళెం గిరిజనకాలనీలోని జడ్‌పిపి హైస్కూల్‌లో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులుగా పనిచేసి రిటైర్ అయిన ముప్పాల పురందర్‌రాజు - వెంకటరత్నమ్మ దంపతులను ఇటీవల జరిగిన పదవీ విరమణ సన్మాన మహోత్సవంలో సన్మానిస్తున్న స్కూల్ ప్రధానోపాధ్యాయులు, ఇతర ఉపాధ్యాయులు

## ● గూడూరులో

# మరో 'దిశ' ఘటన

- మతిస్థిమితం లేని యువతిపై హత్యాచారం
- ఘటనాస్థలిని పరిశీలించిన ఎస్పీ భాస్కర్ భూషణ్



అత్యంత ఘోరమైన 'దిశ' సంఘటనను ప్రజలు మరువకముందే గూడూరు మండలంలో మరో దారుణం చోటు చేసుకుంది. దివిపాళెం పంచాయతీలోని చవటపాళెం ప్రాంతంలో ఓ పాతికేళ్ళ మతిస్థిమితం లేని యువతిపై గుర్తుతెలియని మానవమృగాలు దాడిచేసి, ఆ తర్వాత అత్యంత కిరాతకంగా ఇనుపరాడ్లతో కొట్టి హతమార్చాయి. జిల్లాలో ఈ దుర్ఘటన సంచలనం కలిగించింది. ప్రజలను దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈనెల 5న ఆమె ఇంటినుంచి బయటకువెళ్ళి వంటరిగా వస్తుండడం గమనించిన గుర్తుతెలియని దుండగులు ఆమెను అపహరించి అత్యాచారం చేసి, ఆ తర్వాత అత్యంత దారుణంగా హత్యచేసి పారిపోయారని పోలీసువర్గాలు పేర్కొంటున్నాయి. ఈ దారుణం తెలిసిన వెంటనే జిల్లా ఎస్పీ భాస్కర్ భూషణ్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ దారుణానికి పాల్పడిన దుండగులను త్వరలోనే పట్టుకుని తీరుతామని ఎస్పీ స్పష్టం చేశారు. ఆయన వెంట డిఎస్పీ శ్రీభవాని హర్ష, సిఐలు రామకృష్ణారెడ్డి, దశరధరామారావుతో పాటు ఎస్ఐలు ఉన్నారు.



హత్యాచారానికి పాల్పడిన దుండగులను వెంటనే పట్టుకుని కఠినంగా శిక్షించాలని కోరుతూ, ఆ దారుణం పట్ల నిరసన తెలుపుతున్న ఆంధ్రమహిళామండలి గౌరవాధ్యక్షురాలు డాక్టర్ సి.రోహిణి, ఇన్నర్‌వీల్, మహిళామండలి సభ్యులు, విద్యార్థినులు.

## తాత్కాలిక నియామకానికి

# దరఖాస్తుల ఆహ్వానం

**- సబ్‌కలెక్టర్ గోపాలకృష్ణ**



చెన్నై-బెంగుళూరు పారిశ్రామిక కారిడార్ భూ సమీకరణలో భాగంగా 6 నెలలకు తాత్కాలిక ప్రాతిపదికన పనిచేసేందుకు పదవీ విరమణ చేసిన ఉద్యోగుల నియామకానికి దరఖాస్తులు కోరుతున్నట్లు గూడూరు సబ్‌కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ ఒక ప్రకటనలో కోరారు. ఏపిఐఐసి భూముల సమీకరణకు గూడూరు సబ్‌కలెక్టర్ కార్యాలయం, కోట-చిల్లకూరు తహశీల్దార్ కార్యాలయాల్లో పనిచేసేందుకు పదవీ విరమణ చేసిన తహశీల్దార్లు, డిప్యూటి తహశీల్దార్లు ముగ్గురు, సర్వేయర్లు ముగ్గురు, కంప్యూటర్ ఆపరేటర్లు ముగ్గురు వంతున తాత్కాలిక ప్రాతిపదికన నియమిస్తునట్లు పేర్కొన్నారు. ఆసక్తిగలవారు అర్హత, సర్వీసు అనుభవం తెలియజేస్తూ, తమ దరఖాస్తులను ఈనెల 10వ తేదీలోగా సబ్ కలెక్టర్ కార్యాలయంలో అందజేయాలన్నారు.

# దివ్యాంగులకు పలసరుకులు

గూడూరులోని శ్రీ కల్యాణ వీరభద్రస్వామి దేవాలయంలో స్థానిక ఆంధ్ర మహిళామండలి, ఇన్నర్‌వీల్ క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో, కొండారెడ్డి సౌజన్య దాతృత్వంతో ఇటీవల దివ్యాంగులకు పలసరుకులు పంపిణీ చేశారు. అలాగే గూడూరుపట్టణంలోని సాయిబాబా మందిరంలో ఇన్నర్‌వీల్ క్లబ్, ఆంధ్రమహిళా మండలి సంయుక్త ఆధ్వర్యంలో డాక్టర్ సి.జనార్ధన్‌రెడ్డి, డాక్టర్ సి.రోహిణి పాల్గొని ఉచితవైద్యశిబిరాన్ని నిర్వహించారు. వైద్య పరీక్షల అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

# ఉద్యోగాల్లో స్థానికతకు పెద్దపీట



**- జిల్లా కలెక్టర్ ఎం.వి శేషగిరిబాబు**

జిల్లాలో ఏర్పాటుచేసిన పరిశ్రమల్లో స్థానికులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ ఎం.వి శేషగిరిబాబు స్పష్టం చేశారు. ఈ నెల 4న నెల్లూరులోని తన క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఎంప్లాయిమెంట్ లోకల్ క్యాండిడేట్స్ ఇన్ ఇండస్ట్రీస్, ఫ్యాక్టరీ యాక్ట్ ప్రకారం పరిశ్రమల్లో స్థానికులకు 75 శాతం ఉద్యోగావకాశాలు కల్పించాల్సి ఉంటుందని, నిబంధనల మేరకు పరిశ్రమల్లో స్థానికులకు ఎంతమందికి ఉద్యోగావకాశాలు కల్పించారో 3 నెలలకోసారి కమిటీకి సమాచారం అందజేయాలన్నారు. సమాచారం అందించని వారికి పాతిక వేల నుంచి 50 వేల రూపాయల దాకా అపరాధరుసుం విధిస్తారని కలెక్టర్ హెచ్చరించారు. చట్టంలోని అంశాలపై పారిశ్రామికవేత్తలకు అవగాహన కల్పించాలన్నారు. పదేళ్ళ నుంచి స్థానికంగా ఉంటూ ఆధార్, ఓటర్ గుర్తింపుకార్డు, కరెంట్ బిల్లు కలిగివుండి, స్థానిక రెవెన్యూ అధికారి నుంచి నివాస ధృవీకరణ పత్రం పొందినవారు చట్టప్రకారం ఉపాధి అవకాశాలు పొందేందుకు అర్హులన్నారు. సిఎస్ఆర్ నిధులను సక్రమంగా వినియోగించాలని అధికారులకు చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్‌కుమార్, డిపిసి జీఎం మారుతిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఉప ముఖ్యమంత్రిని కలసిన కలెక్టర్, జేసీ



రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పుష్పశ్రీవాణి ఈనెల 4న తిరుమలకు వెళ్తూ మార్గమధ్యంలో నెల్లూరు నగరంలోని ఆర్అండ్‌బి అతిథి గృహంలో కొద్దిసేపు విశ్రాంతి తీసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎం.వి శేషగిరిబాబు, జేసీ వినోద్‌కుమార్‌తో పాటు జిల్లాలోని వివిధ శాఖల అధికారులు గౌరవపూర్వకంగా ఆమెను కలుసుకుని జిల్లాలోని వివిధ అంశాలపై చర్చించారు.

# మూడు రాజధానులు వద్దే వద్దు

**- అఖిలపక్ష నాయకుల నినాదాలు**



పోలీసులతో వాగ్వాదానికి దిగిన అఖిలపక్ష నాయకులు

రాష్ట్రప్రజల భవిష్యత్తును నాశనం చేసే మూడు రాజధానులు వద్దేవద్దంటూ అఖిలపక్ష నాయకులు నల్లబ్యాడ్జీలు ధరించి నినాదాలు చేస్తూ నిరసన సాగించారు. ఈనెల 7న నెల్లూరు విఆర్సీ సెంటర్‌లో అఖిలపక్ష పార్టీల జేఏసి ఆధ్వర్యంలో జరిగిన ఆందోళన కార్యక్రమంలో టిడిపి, జనసేన, సిపిఐ, లోక్‌సత్తాతో పాటు పలు ప్రజాసంఘాలు పాల్గొన్నాయి. రాష్ట్ర రాజధానిగా అమరావతిని కొనసాగించాలంటూ టిడిపి నేత చంద్రబాబునాయుడు పిలుపుమేరకు నాయకులు ఈ ఆందోళనలో పాల్గొన్నారు. టిడిపి నగర అధ్యక్షుడు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ అమరావతిని రాజధానిగా సిఎం ప్రకటించేవరకు ఉద్యమాలు ఆగవన్నారు. మాజీ మేయర్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ అమరావతి రైతుల సమస్య కాదని, ఇది మన బిడ్డల సమస్యకు సంబంధించినదని అన్నారు. టిడిపి నాయకులు మాజీ ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, ఆనం వెంకటరమణారెడ్డి, హరిబాబు యాదవ్, మనోహర్‌రెడ్డి, కిలారి వెంకటస్వామి నాయుడు, దర్మవరం సుబ్బారావు, సిపిఐ నాయకుడు రామరాజు, బార్ అసోసియేషన్ సభ్యుడు వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి, జనసేన, లోక్‌సత్తా నాయకులు పాల్గొన్నారు.

## రోజువారీ వేతనంపై.. డ్రైవర్లు కావాలి

ఆర్టీసీ ప్రయాణీకుల సౌకర్యార్థం ఈనెల 9 నుంచి 21వతేదీ వరకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని ఆర్టీసీ 1వ డిపో మేనేజర్ విశ్వనాథ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రయాణీకుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఆర్టీసీ అదనంగా నడిపే బస్సులకు రోజువారీ వేతనంపై డ్రైవర్లుగా పనిచేసేందుకు ఆర్టీసీ విశ్రాంత డ్రైవర్లు, ఇతర డ్రైవర్లకు ఆహ్వానం పలుకుతున్నామని పేర్కొన్నారు. విశ్రాంత డ్రైవర్లకు వయస్సు 62 ఏళ్ళకు మించరాదని, హెవీ ప్యాసెంజర్ లైసెన్స్‌తో పాటు వైద్యపరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాలని, ఔట్ సోర్సింగ్ ద్వారా నియమితులయ్యే డ్రైవర్ల వయసు 58 ఏళ్ళ లోపు ఉండాలని, ట్రాన్స్‌పోర్ట్ లైసెన్స్ తీసుకుని 18నెలలై, వైద్యపరీక్షల్లో ఉత్తీర్ణులు కావాలని తెలిపారు. ఈ అర్హతలు ఉన్న డ్రైవర్లకు రోజుకు 800 రూపాయల వేతనం ఇస్తామన్నారు. ఆసక్తి కలవారు నెల్లూరు 1వ డిపో ట్రాఫిక్ సెక్షన్‌కు హాజరు కావాలని సూచించారు.

# శ్రీను గల్పిక: భువనేశ్వరిని బురిడీ కొట్టించిన లోకేష్

అమరావతిలో హైటెకరత్న చంద్రబాబునాయుడు కట్టించిన ఐకాన్ టవర్స్ అవి. ఆకాశాన్ని తాకుతున్నట్లుగా వున్నాయి. వాటికి పక్కనే 110 అంతస్థుల డాల్ఫిన్ హోటల్. బుర్జ్‌ఖలీఫాను మించిపోయి మెరుస్తోంది. ఇడ్లీ పాత్ర ఆకారంలో అసెంబ్లీ భవనం... కుక్కర్ మోడల్‌లో కట్టిన సచివాలయం... గంగాలం డిజైన్‌లో నిర్మించిన హైకోర్టు భవనం... దాని పక్కనే మలేషియా ట్విన్ టవర్స్‌ను తలదన్నేలా నిర్మించిన టెన్ టవర్స్. ఆ నగరం ముందు సింగపూర్, కౌలాలంపూర్, సిడ్నీ, టోక్యో వంటి నగరాలు కూడా దిగదుడుపే అన్నంత అందంగా కనిపిస్తోంది అమరావతి నగరం. ఆ అందమైన నగరంపై ఏదో దుష్టశక్తుల కన్ను పడినట్లుగా... ఒక్కసారిగా అక్కడ భూకంపం... భూమి వూగుతోంది... భవనాలు కదులుతున్నాయి... అప్పుడే చంద్రబాబు, దేవినేని ఉమామహేశ్వరరావు, పి.నారాయణ, పత్తిపాటి పుల్లారావు, ధూళిపాళ్ల నరేంద్ర, ఆలపాటి రాజేంద్రలు పరుగెత్తుకుంటూ వచ్చారు. ఊగుతున్న భవనాలను పడిపోకుండా పట్టుకున్నారు. చంద్రబాబు అయితే రెండు ఐకాన్ టవర్‌లను రెండు చేతులతో పట్టుకున్నాడు. వాటిని పడిపోకుండా చేయడానికి విశ్వప్రయత్నం చేస్తున్నాడు, కాని ఆ భవనాలు పడిపోకుండా ఆపడానికి ఆయన శక్తి చాలడం లేదు. ఆ టవర్స్ క్రమంగా ఒరుగుతున్నాయి, చంద్రబాబు శక్తినంతా కూడతీసుకుని వాటిని కూలకుండా చేయాలనుకుంటున్నాడు గాని ఆయన వల్ల కావడం లేదు, భూకంపం ధాటికి ఐకాన్ టవర్స్ పెద్ద శబ్దంతో కూలిపోయాయి. అవి కూలడంతోనే చంద్రబాబు 'కెవ్' అంటూ పెద్దగా కేకలు పెట్టసాగాడు. ఆ కేకల ధాటికి ఆయన భార్య భువనేశ్వరి, కొడుకు లోకేష్, కోడలు నారా బ్రాహ్మణిలు పరుగెత్తుకుంటూ వచ్చారు. లోకేష్ రావడంతోటే పక్కనే వున్న నీళ్ళబాటిల్ తీసుకుని చంద్రబాబు ముఖంపై బలంగా నీళ్ళు చల్లాడు. అంతే.. ఒక్కదెబ్బకి చంద్రబాబు లేచి కూర్చున్నాడు. బిత్తరబిత్తరగా చుట్టూ చూశాడు. తాను అమరావతిలో లేనని, తన ఇంట్లో బెడ్రూంలోనే వున్నానన్న విషయం చంద్రబాబుకు నిదానంగా అర్థమై ఊపిరి పీల్చుకున్నాడు. అప్పటిదాకా జరిగిందంతా కల అని తెలుసుకునే సరికి మనసు కుదుటపడింది. భువనేశ్వరి వుండి... ఏమైందండి, ఎందుకు అంతగా గావుకేకలు పెట్టారని అడిగింది. దానికి చంద్రబాబు... ఏం చెప్పను భువి... నా కళ్ళ ముందే నా కలల సౌధాలు కూలిపోతున్నాయి. అమరావతి గురించి నేను ఎన్ని కలలు కన్నాను... అని అంటుండగా... అమరావతి మీ క్లాస్‌మేటా నాన్నా అని లోకేష్ మధ్యలో ప్రశ్నించాడు. చంద్రబాబుకు చిర్రెత్తి... అమరావతి అంటే అమ్మాయి కాదురా.. మనం ఎంపిక చేసుకున్న రాజధాని. మనం సిడ్నీ, సింగపూర్, టోక్యో, బీజింగ్ స్థాయిలో నిర్మించాలనుకున్న నగరం. ఇప్పుడు జగన్మోహన్‌రెడ్డి అమరావతిలో రాజధాని లేకుండా చేస్తున్నాడు. నా ఆశల సౌధాలు కూలుస్తున్నాడు. నాకు నిద్ర కూడా పట్టడం లేదు. నిద్రపోయినా, రాజధానిలో భవనాలు కూలిపోతున్న పీడకలలే వస్తున్నాయంటూ వాపోయాడు. చంద్రబాబు బాధను చూసి భువనేశ్వరీదేవి చలించిపోయింది. ఓటు-నోటు కేసులో ఇరుక్కుని హైదరాబాద్ నుండి కరకట్టకు వచ్చేటప్పుడు కూడా ఆయన ఇంతగా బాధపడలేదు, అమరావతి రాజధాని లేకపోతే ఈ మనిషి మానసికంగా నలిగిపోతాడు... కాబట్టి అమరావతి రాజధాని పోరాటంలో తన భర్త పోరాటంలో తానూ భాగస్వామిని కావాలని మనసులో నిశ్చయించుకుంది. వెంటనే బాబుతో.. ఏమండీ, రేపు అమరావతికి నేనూ వస్తాను, రాజధాని పోరాటంలో పాల్గొంటాను అని చెప్పింది. వెంటనే లోకేష్ కూడా... నాన్నారు, నేను కూడా వస్తాను, వంటావార్పు కార్యక్రమంలో పాల్గొంటాను... మొన్న అక్కడ చేసిన చపాతీలు చాలా రుచిగా వున్నాయన్నాడు.

★★★★★

అమరావతి దగ్గర తుళ్లూరు ప్రాంతం. ఒక షామియానా వేసి వుంది. దాని మీద 'రాజధాని కోసం రైతుల ధర్నా' అనే బ్యానర్ వ్రాసివుంది. అప్పుడే అక్కడ 'ఆడి', 'బెంజ్', 'బిఎండబ్ల్యు', 'ఫార్చ్యూన్', 'ఫోర్డ్' వంటి విలాసవంతమైన కార్లు వస్తున్నాయి. వాటిలో నుండి ఖరీదైన ఖద్దరు వస్త్రాలు ధరించిన పురుషులు, పట్టుచీరలు కట్టుకున్న మహిళలు దిగుతున్నారు. అందరి చేతుల్లోనూ ఆపిల్, ఐఫోన్ వంటి ఖరీదైన సెల్‌ఫోన్‌లు వున్నాయి. వారంతా షామియానా క్రిందకు చేరి అమరావతిలోనే రాజధానిని కొనసాగించాలంటూ నినాదాలు చేయసాగారు. అప్పుడే అక్కడకు చంద్రబాబు, భువనేశ్వరి, లోకేష్, నారా బ్రాహ్మణిలు చేరుకున్నారు. రైతులతో పాటు కూర్చున్నారు. రైతులనుద్దేశించి చంద్రబాబు మాట్లాడుతూ... నా శ్రీమతి భువనేశ్వరి... దేశం అల్లకల్లోలం అయినప్పుడు కూడా బయటకు రాలేదు, నన్ను గెలిపించాలని కూడా ఎప్పుడూ బయటకొచ్చి ప్రచారం చేయలేదు. అలాంటిది ఈరోజు మీ కోసం రోడ్డు మీదకొచ్చింది... మీకు మద్దతుగా మీతో కలిసి కూర్చుంది... కాబట్టి ఈ పోరాటం ముందుకే పోతుంది గాని, వెనక్కు తగ్గేది లేదన్నాడు. భువనేశ్వరీదేవి మాట్లాడుతూ... అమరావతి రాజధాని కోసం మీ నాయకుడు చంద్రబాబు గారు పడుతున్న తపన చూస్తుంటే నా మనసు తరుక్కుపోతోంది, కళ్లల్లో నీళ్లు తిరుగుతున్నాయి, గత రెండు వారాలుగా ఆయన ఎన్ని నిద్రలేని రాత్రులు గడుపుతున్నాడో మాకు తెలుసు... ఈ పేదరైతుల ఉద్యమానికి మద్దతుగా నా విరాళం అంటూ చేతికున్న బంగారు గాజులను తీసి అక్కడున్న రైతుల చేతికిచ్చింది. లోకేష్ అది చూసి ఖంగుతిని, మైకందుకుని... మా అమ్మ ఎంతో కష్టపడి, పాలు, పెరుగు, కూరగాయలు అమ్మి, రూపాయి రూపాయి కూడబెట్టుకుని ఆ గాజులు చేయించుకుంది... మా ఇంట్లో అమ్మ, నా భార్య సంపాదించి తెస్తేనే ఆ పూటకు అన్నం వండుకోవాలి.. ఇప్పుడు ఇంటికి పోతే తినడానికి గంజినీళ్ళు కూడా వుండవు. అయినా మా అమ్మ తన బంగారు గాజులు ఉదారంగా ఇచ్చేసింది అన్నాడు. అది విని స్పందించిన ఒక రైతు.. మరీ అంత దరిద్ర పరిస్థితుల్లో వుంటే ఆ గాజులు వద్దులే బాబు అని చెప్పగా... చంద్రబాబు కలుగజేసుకుని... ఇచ్చిన మాట, చేసిన దానం తిరిగి తీసుకోవడం మా ఇంటా వంటా లేదన్నాడు.

★★★★★

హైదరాబాద్‌లోని చంద్రబాబు ఇల్లు. భువనేశ్వరీదేవి వచ్చి... ఏమండీ నేను అమరావతి రైతులకు మద్దతుగా దీక్షలో పాల్గొనడానికి వెళుతున్నాను అని చెప్పింది. చంద్రబాబు ఆమెను చూసి గతుక్కుమన్నాడు. రెండు మోచేతుల దాకా బంగారు గాజులున్నాయి. నువ్విలా వెళ్లిన చోటల్లా గాజులు దానం చేస్తుంటే చివరకు మనం అడుక్కుతినాల్సి వస్తుందని చంద్రబాబు అన్నాడు. దానికి భువనేశ్వరి.. నేను ఎన్టీఆర్ కూతుర్ని.. ప్రజల కోసం ఎంతైనా దానం చేస్తానంది. పోనీలే డాడీ... అమ్మ చేసే దానంతో పేరొచ్చేది మనకే కదా అని లోకేష్ అన్నాడు. మా బంగారు తండ్రి అంటూ భువనేశ్వరీదేవి కొడుకు మాటలను మెచ్చుకుని అమరావతికి బయలుదేరింది. చంద్రబాబు కోపంగా... ఆమె ఇలా బంగారు గాజులు దానం చేసుకుంటూ పోతే... చివరకు మనిద్దరం పాలు, కూరగాయలు నిజంగానే అమ్ముకోవాల్సి వస్తుందని చంద్రబాబు అన్నాడు. దానికి లోకేష్... పూర్ డాడీ.. నేను మరీ అంత అమాయకుడినా... అమ్మ దానగుణం తెలిసే.. నిన్న ఓల్డ్‌సిటీ నుండి వెయ్యి రోల్డ్‌గోల్డ్ గాజులు తెప్పించాను... అమ్మ బంగారు గాజుల స్థానంలో వాటిని పెట్టాను. ఇప్పుడు అమ్మ చేతులకు వున్నది రోల్డ్‌గోల్డ్ గాజులేనని అన్నాడు. లోకేష్ తెలివి తేటలకు చంద్రబాబు నోరెళ్లబెట్టాడు.




# భక్తి శ్రద్ధలతో.. ముక్కోటి

పోటెత్తిన భక్తులు

వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈనెల 6న జిల్లావ్యాప్తంగా ఆలయాల్లో విశిష్టమైన అలంకారాలు.. ప్రత్యేకపూజలు జరిగాయి. వైష్ణవాలయాల్లో ముక్కోటి ఉత్తర ద్వారదర్శనం ఏర్పాట్లు చేయడంతో భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేశారు. నెల్లూరు రంగనాథ స్వామి ఆలయం, శ్రీ వేణుగోపాలస్వామి ఆలయం, పెంచలకోనలోని శ్రీ లక్ష్మీ నృసింహస్వామి ఆలయం, బిట్రగుంటలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం తదితర ఆలయాలకు భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేసి స్వామివార్లను దర్శించుకున్నారు.

నెల్లూరు నగరంలోని రంగనాయకుల పేటలో ఉన్న శ్రీ రంగనాథస్వామి ఆలయంలో వేకువన 2గంటల నుంచే వైకుంఠ ఏకాదశి ఉత్తర ద్వారదర్శనం కోసం భక్తులు బారులు తీరారు. ఈ సందర్భంగా స్వామివారిని శోభాయమానంగా అలంకరించారు. శ్రీ రంగనాథ స్వామి ఆలయ ప్రాంగణంలోనే ఉన్న శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ సందర్భంగా స్వామివారికి కన్నుల పండువగా పూలంగిసేవ నిర్వహించారు. ఈ సేవకు రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి..తిరుమల తిరుపతి దేవస్థానాల పాలకమండలి సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఉభయ కర్తలుగా వ్యవహరించారు.

మూలాపేటలోని శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి వేడుకలు ఘనంగా జరిగాయి. అదే విధంగా రామ్‌నగర్‌లోని శబరి శ్రీరామ క్షేత్రంలో మూలవర్లకు విశేష అలంకారాలు చేశారు. పప్పులవీధిలోని జైశ్రీరామ్ హనుమాన్ భక్తబృందం వారు వైకుంఠ ఏకాదశి సందర్భంగా భక్తులకు 25 వేల లడ్డూ ప్రసాదాన్ని పంపిణీచేశారు. నెల్లూరు మాగుంట లేఅవుట్‌లో ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి వేడుకలు వైభవంగా జరిగాయి. స్వామివారికి విశేష అలంకారాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నెల్లూరు దర్గామిట్ట టీటీడీ కల్యాణ మండపంలో తిరుమల తిరుపతి దేవస్థానములు, హిందూధర్మ ప్రచార పరిషత్, శ్రీ వేంకటేశ్వర కల్యాణ మహోత్సవ సేవా సమితి నెల్లూరు వారి సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 6న వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని నేత్ర పర్వంగా నిర్వహించారు. శ్రీ వేంకటేశ్వర స్వామిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. వైకుంఠ ఏకాదశి ప్రాశస్త్యం గురించి డాక్టర్ మల్లెల శ్రీహరి ప్రవచించారు. ఈ సందర్భంగా కళాదీప్తి డాన్స్ ఇన్‌స్టిట్యూట్ చిన్నారులచే నిర్వహించిన భక్తి సంగీత నృత్య కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

## త్యాగరాజస్వామి ఆరాధన 15న

నెల్లూరు వేదాయపాలెం త్యాగరాజ నగర్‌లోని శ్రీ సద్గురు త్యాగరాజస్వామి మందిరంలో ఈనెల15న సద్గురు నాద బ్రహ్మానంద సరస్వతిస్వామి (త్యాగరాజ స్వామివారి ఆరాధన) మహోత్సవం జరుగుతుందని త్యాగరాజ సేవా సమితి నిర్వాహకులు తెలిపారు. ఉదయం 7 గంటలకు శ్రీ త్యాగరాజస్వామి వారికి అభిషేకం, నామార్చన, 7.30 గంటలకు త్యాగరాజనగర్‌లో త్యాగరాజస్వామి భక్త బృందంచే భిక్షాటనంతో నగర సంకీర్తన, 8.30 నుండి 10 గంటల వరకు ఔత్సాహిక సంగీత కళాకారులచే త్యాగరాజ కృతుల గానం, అనంతరం ప్రభుత్వ సంగీత కళాశాల విద్యార్థులచే పంచరత్న కీర్తనల గానం జరుగుతుందన్నారు. 11 గంటలకు మాచవోలు వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో శ్రీ త్యాగరాజస్వామి వారి ఆరాధన జరుగుతుందన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు అన్న ప్రసాద వితరణ జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

## 17న 'పెరసం'.. సంక్రాంతి కవిసమ్మేళనం

నెల్లూరులోని పెన్నా రచయితల సంఘం(పెరసం), మాతృభాష ఐక్య కార్యాచరణ సమితి సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 17న నగరంలోని టౌన్‌హాల్ రీడింగ్ రూంలో తెలుగు సంస్కృతి సంప్రదాయాలపై సంక్రాంతి కార్యక్రమం, కవిసమ్మేళనం నిర్వహిస్తామని నిర్వాహకులు మోపూరు పెంచలనరసింహం, అవ్వారు శ్రీధర బాబు, గోవిందరాజు సుభద్రాదేవి తెలిపారు. ప్రముఖ సాహితీవేత్త పొట్లూరి హరికృష్ణ ముఖ్యఅతిథిగా విచ్చేయనున్నారని, ఈ సందర్భంగా తెలుగుభాష అభివృద్ధికి కృషి చేస్తున్నవారిని సన్మానిస్తామని, కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులకు సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందజేస్తామని పేర్కొన్నారు.

• రామ్ జన్మదినం

## పేదలకు వస్త్రదానం



నేదురుమల్లి ఫౌండేషన్ ఛైర్మెన్ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బాపట్ల, తిరువతి పార్లమెంట్ నియోజకవర్గాల ఇన్‌ఛార్జ్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ఈ నెల 8వ తేదీన నెల్లూరు, పొదలకూరురోడ్డులోని సాల్వేషన్ ఆర్మీ చర్చిలో నేదురుమల్లి ఫౌండేషన్ సభ్యులు టి.బాలసుధాకర్ ఆధ్వర్యంలో పేదలకు వస్త్రదానం నిర్వహించారు. నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఉన్నతి కోసం ప్రత్యేక ప్రార్థన చేశారు. ఈ కార్యక్రమంలో కోర్ కమాండర్ ఆఫీసర్ మేజర్ బి.లాజరస్, బి.రాజేశ్వరి, అప్పయ్య, నరసయ్య, మేరీతేస్, విజయప్రసాద్, ప్రదీప్ మ్యాగి, రోజస్, దయాసుధ పాల్గొన్నారు.

## నిరుపేద విద్యార్థుల కోసం.. దోనిపర్తి వెంకయ్య విరాళం



నెల్లూరుజిల్లా గాండ్ల తెలికల సంక్షేమ సంఘం వారి నిరుపేద విద్యార్థుల సహాయ నిధికి బుచ్చివాసి, ప్రవాస భారతీయుడు దోనిపర్తి వెంకయ్య లక్ష రూపాయలు విరాళంగా అందజేశారు. ఈ నెల 9వ తేదీన సంఘం అధ్యక్షులు గ్రోసు గోపాలయ్యను కలిసి ఆయన ఈ విరాళాన్ని అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మురళీకృష్ణ హోటల్స్ అధినేత వీరిశెట్టి హజరత్‌బాబు, సంఘం కార్యదర్శి టి.హరగోపాల్, కోశాధికారి వరిగొండ సురేష్‌బాబు, కార్యనిర్వాహక అధ్యక్షులు చాకిరాల శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

# జగన్ మాటే.. కమిటీల నోట

- సోమిరెడ్డి ఆగ్రహం



ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి ఏదైతే కోరుకుంటున్నాడో రాజధాని విషయంలో ఆయన వేస్తున్న కమిటీలు కూడా ఆయనకు తగ్గట్లుగానే నివేదికలిస్తున్నాయని మాజీమంత్రి, తెలుగుదేశం పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మండిపడ్డాడు. ఈ నెల 4వ తేదీన నెల్లూరులోని ఎన్టీఆర్ భవన్‌లో పార్టీ ముఖ్యనేతల సమావేశం జరిగింది. ఇందులో పాల్గొన్న సోమిరెడ్డి మాట్లాడుతూ ఐదుకోట్ల ఆంధ్రుల భవిష్యత్‌ను కమిటీల రూపంలో ఐదురోజుల్లో ఎలా తేలుస్తారని ప్రశ్నించాడు. జిఎన్‌రావు కమిటీ, బిసిజి కమిటీలు జగన్మోహన్‌రెడ్డి చెప్పిన స్క్రిప్ట్‌నే రాసుకుని నివేదిక రూపంలో ఇచ్చాయని విమర్శించాడు. వైజాగ్‌లో ఎంపి విజయసాయిరెడ్డి ఏమని ప్రకటించాడో, నివేదికల్లోనూ అదే వ్రాశారన్నాడు. ప్రజలు 151 సీట్లిచ్చి గెలిపిస్తే, వారికి సుపరిపాలన అందించాల్సింది పోయి, గందరగోళంలోకి నెట్టారన్నాడు. గవర్నర్ నివాసాన్ని జిఎన్‌రావు కమిటీ అమరావతిలో వుండాలని సూచిస్తే బిసిజి కమిటీ మాత్రం విశాఖకు మార్చాలని సూచించిందని, మంత్రుల నివాసాలు అమరావతిలో వుండాలని జిఎన్‌రావు కమిటి చెబితే, బిసిజి కమిటి అసలు మంత్రుల నివాసాల గురించే ప్రస్తావించలేదని, మంత్రులు గాల్లో వుంటారా అని ఆయన ప్రశ్నించాడు. హైకోర్టును ఎక్కడికంటే అక్కడికి మార్చడం మీతరంకాదని, న్యాయవ్యవస్థలో దానికంటూ ఓ పద్ధతి వుంటుందని ఆయన పేర్కొన్నాడు.

పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు కంభం విజయరామిరెడ్డి, కొమ్మి లక్ష్మయ్యనాయుడు, కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, జడ్పీ మాజీ ఛైర్మెన్ పి.చెంచలబాబుయాదవ్, నుడా మాజీఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మాజీమేయర్ అబ్దుల్ అజీజ్, పార్టీ నాయకులు బి.మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీసిటీని సందర్శించిన.. రాష్ట్ర పరిశ్రమల శాఖ డైరెక్టర్

రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఎగుమతుల శాఖ డైరెక్టర్ జెవిఎన్ సుబ్రహ్మణ్యం ఈనెల 4న శ్రీసిటీని సందర్శించారు. ఈ సందర్భంగా శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఆయనకు సాదర స్వాగతం పలికి శ్రీసిటీ ప్రత్యేకతలను వివరించారు. అనంతరం డైరెక్టర్ జెవిఎన్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ శ్రీసిటీలో ఉద్యోగ ఉపాధి కల్పనలు బావున్నాయంటూ సంతృప్తి వ్యక్తం చేశారు. పరిశ్రమలకు అన్ని విధాలా ప్రోత్సాహాన్ని అందిస్తామన్నారు. నిరుద్యోగుల్లో నైపుణ్యం పెంచేందుకు ప్రత్యేక నైపుణ్య శిక్షణ ఇవ్వాలని, అందుకు రాష్ట్రప్రభుత్వం తగు సహాయ సహకారాలను అందిస్తుందని తెలిపారు. విజయవాడ, చిత్తూరు పరిశ్రమల శాఖ జాయింట్ డైరెక్టర్లు విజయరత్నం, ఇ.ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.



పరిశ్రమల శాఖ డైరెక్టర్‌కు శ్రీసిటీ ప్రగతిని వివరిస్తున్న శ్రీసిటీ ఎండి రవీంద్ర సన్నారెడ్డి

### శ్రీసిటీలో.. ట్రైనీ ఐఏఎస్ అధికారులు

భారత్ దర్శన్ స్టడీ టూర్‌లో భాగంగా 18 మంది ట్రైనీ ఐఏఎస్ అధికారులు ఈనెల 6న శ్రీసిటీకి వచ్చారు. శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ (కస్టమర్ రిలేషన్స్) వారికి స్వాగతం పలకగా, వైస్ ప్రెసిడెంట్ (ఆపరేషన్స్) సతీష్‌కామత్ వారికి శ్రీసిటీ ప్రగతిని తెలియజేశారు. భారతదేశ ఆశయాలకు అనుగుణంగా ఉద్యోగాల కల్పనలోనూ, ఆర్థిక వ్యవస్థను వేగవంతం చేయడంలోనూ ప్రముఖపాత్ర పోషిస్తూ ముందుకు సాగుతున్న దేశంలోని మెగా ఇండస్ట్రియల్ పార్కుల్లో శ్రీసిటీ ఒకటని ఆయన వివరించారు. వీరి పర్యటనపై శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి స్పందిస్తూ ట్రైనీ ఐఏఎస్ అధికారులు శ్రీసిటీ పర్యటనకు రావడం సంతోషంగా ఉందన్నారు. దేశవిదేశాలకు చెందిన అధికారులు, సాంకేతిక నిపుణులు అధ్యయనం కోసం శ్రీసిటీకి వస్తుండడం తమకు గర్వకారణమన్నారు.

### టెన్త్ విద్యార్థులకు 'విజయసాధన' పుస్తకాలు

శ్రీసిటీ ఫౌండేషన్ ద్వారా శ్రీసిటీ సమీపంలోని మాదనపాళెం, ఇరుగుళం జడ్పీహైస్కూల్లో చదువుకుంటున్న పదవ తరగతి విద్యార్థులకు ఈనెల 6న 'విజయసాధన' పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. జిల్లా విద్యాశాఖకు చెందిన కామన్ ఎగ్జామినేషన్ బోర్డు ద్వారా పదవ తరగతి విద్యార్థులకు ఉపయోగపడే ప్రత్యేక స్టడీ మెటీరియల్ 'విజయసాధన' పేరిట తయారుచేసి విక్రయిస్తున్నారని, శ్రీసిటీ ఫౌండేషన్ వాటిని కొనుగోలుచేసి శ్రీసిటీ అధికారి రాంగోపాల్ ద్వారా విద్యార్థులకు అందజేశామని శ్రీసిటీ ఫౌండేషన్ సిబ్బంది తెలియజేశారు.

# జిల్లాలో బంద్ ప్రశాంతం..



బంద్‌లో పాల్గొన్న వామపక్ష నాయకులు, కార్యకర్తలు

కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందని ఆరోపిస్తూ ఈనెల 8 న అఖిలపక్షం ఆధ్వర్యంలో చేపట్టిన భారత్ బంద్ నెల్లూరు జిల్లాలో విజయవంతమైంది. వామపక్ష పార్టీలు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఊరూరా నిరసనలబాట పట్టిన ఆందోళనకారులు ఎక్కడికక్కడ రహదారులు దిగ్బంధించి దుకాణాలను, పాఠశాలలను మూయించారు. ప్రధానంగా జిల్లాకేంద్రమైన నెల్లూరు, నెల్లూరు రూరల్ ప్రాంతాల్లో బంద్ ప్రభావం ఎక్కువగా కనిపించింది. వామపక్ష పార్టీలు, కార్మిక సంఘ నాయకులు నెల్లూరు ఆర్టీసీ బస్టాండు నుంచి వీఆర్సీ సెంటర్ వరకు నిరసన ప్రదర్శనలు చేపట్టారు. ఆత్మకూరు బస్టాండు నుంచి వీఆర్సీసీ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. వీరికి మద్దతుగా కాంగ్రెస్, ముస్లిం మైనారిటీ నాయకులు నిలిచారు. ఆందోళనకారులు జాతీయజెండాలు చేతపట్టి ఎన్ఆర్సీ, సీఏఏ లకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కొంతమంది నల్ల రిబ్బన్లు ధరించి ద్విచక్రవాహనాలపై నగరవీధుల్లో తిరుగుతూ ఆత్మకూరు బస్టాండు నుంచి స్టోన్‌హౌస్ మీదుగా నవాబుపేట వరకు దుకాణాలు మూత వేయించారు. జాతీయ రహదారిని కొంతసేపు నిర్బంధించి వాహనాల రాకపోకలను అడ్డుకున్నారు. అన్ని నియోజకవర్గాల్లో బంద్ ప్రశాంతంగా జరిగింది.

### బొందిలి యూత్ ఆధ్వర్యంలో

## రోగులకు రొట్టెలు, పండ్లు



ఆంధ్రప్రదేశ్ బొందిలి యూత్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యశ్వంత్ సింగ్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా నెల్లూరులోని ప్రభుత్వాసుపత్రిలో రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యశ్వంత్‌సింగ్ మాట్లాడుతూ సావిత్రీబాయి పూలే కుల నిర్మూలన కోసం జీవితాంతం పోరాడిన యోధురాలని కొనియాడారు. 1896-97లో మహారాష్ట్రలో సంభవించిన ప్లేగు వ్యాధికి గురైన వారికి సేవ చేయడంలో నిమగ్నమై చివరికి అదే వ్యాధితో ఆమె అసువులు బాశారని తెలిపారు. రవిచంద్ర సింగ్, సుభాష్, నాగ మోహన్, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంత అలసత్వమా?

## కార్పొరేషన్ సిబ్బంది తీరుపై కలెక్టర్ ఆగ్రహం



కార్పొరేషన్ గోడౌన్‌ను తనిఖీ చేస్తున్న జిల్లా కలెక్టర్ శేషగిరిబాబు

విధి నిర్వహణలో అలసత్వం పనికిరాదని, కార్పొరేషన్‌లో పారిశుద్ధ్య సామగ్రి నిల్వచేసే గోడౌన్‌లో ఏ వస్తువు ఎక్కడుందో స్పష్టత లేదని, సంబంధిత అధికారుల పర్యవేక్షణ కొరవడిందని, మరీ ఇంత నిర్లక్ష్యమా అంటూ నగరపాలక సంస్థ సిబ్బందిపై జిల్లా కలెక్టర్ ఎంవి శేషగిరిబాబు మండిపడ్డారు. గోడౌన్‌ను నిర్వహిస్తున్న ఉద్యోగులపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈనెల 7న పాత మునిసిపల్ కార్యాలయం ప్రాంగణంలో పారిశుద్ధ్య సామగ్రిని నిల్వచేసే గోడౌన్‌ను కలెక్టర్ పరిశీలించారు. ఈ గోడౌన్‌ల నిర్వహణ సరిగా లేదని, సంబంధిత ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని, గోడౌన్‌లో వస్తువులకు లెక్కచెప్పాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సిబ్బంది తీరు మారకుంటే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు.

### గూడూరు ఘటనలో

## అత్యాచార నిందితులను పట్టేశారు



వివరాలను వెల్లడిస్తున్న గూడూరు రూరల్ సిఐ కె.రామకృష్ణారెడ్డి

మతి స్థిమితం లేని యువతిపై అత్యంత దారుణంగా అత్యాచారానికి పాల్పడి హత్యచేసిన కేసులో ఐదుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. గూడూరు మండలం చవటపాళెం ప్రాంతంలో జరిగిన ఈ దారుణ ఘటనపై పోలీసులు అత్యంత వేగంగా స్పందించి నిందితులను పట్టుకున్నారు. నిందితులు దుగ్గనబోయిన సాయిశివ కుమార్(20), గోవిందస్వామి వెంకటేష్(24), మద్దూరు శరత్(24), సుబ్రమల్లి వినోద్ కుమార్(22), చల్లా లక్ష్మయ్య(26)లను అరెస్టుచేసి కోర్టుకు హాజరుపరుస్తున్నట్లు గురువారం రూరల్ సి.ఐ కె.రామకృష్ణారెడ్డి విలేకర్లకు తెలిపారు. ఈ సమావేశంలో రూరల్ ఎస్.ఐ జి.పుల్లారావు, హెడ్‌కానిస్టేబుల్స్ హుస్సేన్‌భాషా, ఆర్.వెంకటేశ్వర్లురాజు, పోలీసు సిబ్బంది పి.ఆదినారాయణ, నావూరయ్య, శ్రీనివాసులు, మాధవరావు, నాగేంద్ర, జి.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కాగా, ఈ దారుణ ఘటన జరిగిన సమాచారాన్ని 8వ పేజీలో 'గూడూరులో మరో దిశ ఘటన' అని ప్రచురించి వున్నాము. ఈ సంచిక వెలువడక ముందే 9వ తేదీన నిందితులను అరెస్ట్ చేయడంతో నిందితుల వివరాలను ఇక్కడ ఇవ్వడం జరిగింది. ఏదేమైనా ఈ పాశవిక ఘటనకు కారణమైన నిందితులను ఇంత త్వరగా అదుపులోకి తీసుకున్న జిల్లా పోలీస్ యంత్రాంగానికి, జిల్లా ఎస్పీ భాస్కర్ భూషణ్‌కు 'లాయర్' అభినందనలు.

# అంచలంచెలుగా పతనం అంచులకు...

(మొదటి పేజీ తరువాయి)

### అన్ని విధాలా ఇరుక్కున్నాడు

వైయస్ జగన్మోహన్‌రెడ్డి విశాఖపట్నంను రాజధానిగా ఎంపిక చేయడంతో చంద్రబాబులో దాగున్న 'కుల' పురుషుడు బయట కొచ్చాడు. రాష్ట్రాన్ని అన్యాయంగా విడదీస్తున్న రోజుల్లో కూడా బయటకు రాని చంద్రబాబునాయుడు, తన కుల కలల సామ్రాజ్యం కూలిపోతుందేసరికి రోడ్డున పడ్డాడు. అమరావతి రైతుల దీక్షకు మద్దతు అంటూ ఎలాంటి విపత్కర సందర్భాలలోనూ బయటకురాని తన సతీమణి భువనేశ్వరీదేవిని కూడా బయటకు తీసుకొచ్చాడు. అన్యాయంగా రాష్ట్ర విభజన జరిగే టప్పుడు కూడా రాష్ట్ర ప్రజల తరపున పోరాడని చంద్రబాబు నాయుడు ఈరోజు తన వర్గం వారి ఆర్థిక ప్రయోజనాలు దెబ్బ తింటున్నాయని చెప్పి 29 గ్రామాల ప్రజల కోసం రోడ్డెక్కి ధర్నాలు చేస్తుంటే, 13 జిల్లాల ప్రజలు విస్తుపోతున్నారు. జాతీయ స్థాయి నాయకుడు చివరకు గ్రామస్థాయికి దిగజారి, కొన్ని గ్రామాలలో తన వర్గం వారి ప్రయోజనాల కోసం పోరాటం చేయడమేంటని ప్రశ్నిస్తున్నారు.

### రాష్ట్రంలో కనిపించని వ్యతిరేకత

రాజధానిని అమరావతి నుండి విశాఖపట్నంకు మార్చడంపై ఉత్తరాంధ్ర జిల్లాల్లో కాకపోయినా కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో ప్రజల నుండి పెద్దఎత్తున వ్యతిరేకత వస్తుందని, జగన్ ఆత్మ రక్షణలో పడి తిరిగి అమరావతినే ప్రకటిస్తాడని చంద్రబాబు భావించాడు. చంద్రబాబు ఆరోజైనా, ఈరోజుకైనా ప్రధానంగా తెలుసుకోవాల్సింది ఏంటంటే రాజధాని గురించి ప్రజలు పెద్దగా పట్టించుకోరనే విషయం. ఎందుకంటే వందలో ఒకరికి కూడా రాజధానితో పనుండదు. రాజధానిలో పనుండేవాళ్ళు అది ఎంత దూరంలో వున్నా వెళతారు. అదీగాక చంద్రబాబు ఐదేళ్ల అమరావతి రాజధాని జపం చేయడాన్ని ప్రజలు ఎంతగా వ్యతిరేకించారన్న దానికి నిన్నటి ఫలితాలే ఉదాహరణ. రాష్ట్ర విభజన తర్వాత హైదరాబాద్ అనుభవంతో సామాన్య ప్రజలు కూడా అభివృద్ధి వికేంద్రీకరణ జరగాలని కోరుకున్నారు. నేడు జగన్ అదే పని చేశాడు. రాష్ట్రంలోని మూడు ప్రాంతాల్లో మూడు రాజధానుల నిర్ణయాన్ని ప్రజలు స్వాగతిస్తున్నారేగాని, అమరావతి ఒక్కటే రాజధానిగా వుండాలని కోరుకోవడం లేదు.

### తప్పులో వారికే భాగం

ఒక పరిశ్రమను నెలకొల్పడానికి వంద ఎకరాల భూసేకరణ చేయాలంటేనే కనాకష్టమవుతోంది. అలాంటిది అమరావతిలో రాజధాని పేరు చెప్పి, హైదరాబాద్‌లోని జూబ్లిహిల్స్ రేట్లు లెక్కకట్టి అమరావతి రైతులకు అరచేతిలో స్వర్గం చూపించి 33వేల ఎకరాల భూసేకరణ చేశారు. ఆరోజు చంద్రబాబు మాటలు అతిగా నమ్మి ఆ ప్రాంత రైతులు మోసపోయారు. కొంత సామాజిక పైత్యంతో కూడా భూములు వదలుకున్నారు. అసలు 33వేల ఎకరాలలో రాజధాని అవసరమా? ముందు 5వేల ఎకరాలలో చేయండి.. ఆ తర్వాత అభివృద్ధి చెందితే మా పొలాలకు రేట్లు వచ్చి మేం కూడా లబ్ధి పొందుతామని రైతులు నిలదీసి వుంటే, భూములు ఇవ్వకుండా వుంటే ఈరోజు వాళ్లకు ఈ పరిస్థితి వచ్చేది కాదు కదా! ఈ ఐదేళ్ల ప్రతి ఏటా ప్రభుత్వం నుండి పరిహారం పొందారు. ఇప్పుడు ప్రభుత్వమే ఎవరి భూములు వాళ్ళకు ఇస్తామంటుంది. ఇందులో నష్టపోయేదేముంది. కాకపోతే చంద్రబాబు ఆశపెట్టినట్లుగా ఆకాశం అందలేదంతే!

### దౌర్జన్యాలకు దిగితే... దారులు బిగుసుకున్నట్లే!

అమరావతిని రాజధానిగా ఎంపిక చేసినప్పటి నుండి దానిపై ఒక సామాజికవర్గం ముద్ర వుంది. రాజధానిలో ఆ వర్గం వారిదే ఆధిపత్యమవుతుందని, మిగిలిన వాళ్ళు వాళ్ళ దయా దాక్షిణ్యాల మీద అక్కడ వుండాల్సి వస్తుందన్న ప్రచారం వుంది. చంద్రబాబు ఆలోచన కూడా అదే! ఆయన కుటిల యత్నాలకు జగన్ చెక్‌పెట్టి అన్ని వర్గాల ప్రజలకు అనుకూలంగా, ప్రజా రాజధానిగా విశాఖపట్నంను ఎంచుకున్నాడు. ఇప్పుడు ఆ కోపంతో అమరావతి రైతులు దౌర్జన్యాలకు దిగడం ద్వారా అమరావతి నుండి రాజధానిని మార్చడం మంచిదైందనే అభిప్రాయం కల్పిస్తున్నారు. 29 గ్రామాల ప్రజల ఆర్థిక ప్రయోజనాలు నెరవేర్చే చంద్రబాబు కలలకు 13 జిల్లాల ప్రజలు కట్టే పన్నులను ఖర్చు పెట్టాలా? అమరావతిని కట్టుకుంటూపోతే చాలా? మిగిలిన ప్రాంతాల అభివృద్ధి అక్కరలేదా? అనే ప్రశ్నలు కూడా అన్ని ప్రాంతాల ప్రజల నోట వినిపిస్తున్నాయి. ముఖ్యంగా రాజధానిగా వైజాగ్ ఎంపికపై అమరావతి గ్రామాలలో తప్పితే మరెక్కడా వ్యతిరేకత కనిపించకపోవడం అమరావతి రైతుల పోరాటాన్ని నీరుగారేలా చేస్తోంది. పుండు మీద కారం చల్లినట్లుగా మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిపై రైతుల ముసుగులో తెలుగుదేశం వాళ్లు చేసిన దాడి వుంది. రాజధాని రాకుంటేనే పరిస్థితులు ఇంత భయంకరంగా వున్నాయి... వచ్చుంటే ఇక్కడ మిగిలిన వర్గాల ప్రజలను బ్రతకనిస్తారా? అన్న ఒక అభిప్రాయం ఈ ఘటనతో ఏర్పడిపోయింది.

### ఇప్పుడు జగన్‌పై... రేపు బాబుపై...

అమరావతి రైతులు ఇప్పుడు జగన్ మీద కారాలు మిరియాలు నూరుతున్నారు. రాజధానిని మార్చి మా కులసౌధాన్ని కూల్చాడని వాపోతున్నారు. వాస్తవంగా ఆలోచిస్తే అమరావతి రైతుల నుండి భూములు లాక్కున్నది చంద్రబాబు... వారికి ఆశలు కల్పించింది ఆయనే! ఐదేళ్ల కాలంలో వాటిని సాకారం చేసే అవకాశమున్నా కాలయాపన చేసిందీ ఆయనే! కాబట్టి అమరావతి రైతులు వాస్తవకోణంలో ఆలోచించే రోజు దగ్గర్లోనే వస్తుంది. అప్పుడు వాళ్ళు జగన్‌ను తిట్టడం మాని చంద్రబాబుకు చీవాట్లు వేయడం మొదలుపెడతారు.

మొత్తానికి బిల్‌క్లింటన్ లెవల్లో వున్నట్లు ఫోజులిచ్చే చంద్రబాబు జగన్ దెబ్బకు కుడితిలో పడ్డ ఎలుకలా గిలగిల తన్నుకుంటుండడం ఆశ్చర్యం గొలిపే విషయమే!

# 'స్థానిక' పోరుకు.. పచ్చజెండా!

(మొదటి పేజీ తరువాయి)

పట్టింపులు, వర్గ రాజకీయాలు, గ్రూపులు... అన్నీ కనిపించేది అక్కడే! పార్టీకంటే కూడా స్థానిక నాయకత్వాలే ఎన్నికల్లో ప్రభావం చూపుతుంటాయి. సంక్రాంతి సందడి ముగిసిన వెంటనే పల్లెల్లో ఎన్నికల సందడి మొదలుకానుంది.

హైకోర్టు ఆదేశాల మేరకు ఈ నెల 17న జడ్పీటీసీ, ఎంపీటీసీల ఎన్నికలకు నోటిఫికేషన్ వెలువడాలి. ఫిబ్రవరి 15వ తేదీలోగా ఈ ఎన్నికల ప్రక్రియ మొత్తం పూర్తైపోవాలి. పంచాయితీ ఎన్నికలకు మాత్రం ఫిబ్రవరి 8న నోటిఫికేషన్ వెలువడుతుంది. మార్చి 3వ తేదీలోపు ఎన్నికల ప్రక్రియ పూర్తికావాలి. ఈమేరకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఇచ్చిన షెడ్యూల్‌ను హైకోర్టు ఆమోదించింది.

స్థానిక ఎన్నికలు వాయిదాపడతాయని చాలామంది ఊహించారు. స్థానిక ఎన్నికల్లో ప్రభుత్వం రిజర్వేషన్ల కోటాను పెంచింది. మొత్తం రిజర్వేషన్లు 50శాతంకు మించకూడదని నిబంధనలున్నా, ప్రభుత్వం 59శాతం దాకా రిజర్వేషన్లు అమలుచేసి, తుది నివేదికను హైకోర్టుకు సమర్పించింది. హైకోర్టు ప్రభుత్వ ప్రయత్నాలకు బ్రేక్ వేయకుండా రిజర్వేషన్ల పెంపుపై వివరణ కోరుతూ ఎన్నికలకు పచ్చజెండా వూపింది.

# సినీ రంగంలోనూ... కు(క)ల కలం

(మొదటి పేజీ తరువాయి)

కుటుంబ ఆధిపత్యం కూడా మొదలైంది. ఈరోజు చిరంజీవి తలచుకుంటే, ప్రభుత్వం అందుకు సహకరిస్తే తెలుగు సినీ పరిశ్రమ కొంతవరకు వైజాగ్ తరలి రాగలదు. ముఖ్యంగా చిరంజీవి తలచుకుంటే పరిశ్రమలోని ఒక వర్గం వైజాగ్‌కు వచ్చేస్తుంది.

కాని, కమ్మ సామాజికవర్గంలో ఎక్కువ మందికి హైదరాబాద్‌లోనే వుండడం ఇష్టంగా వుంది. అక్కడే వారి ఆస్తులన్నీ వున్నాయి. వాటిని కాపాడుకోవడానికైనా సినీ పరిశ్రమను అక్కడే వుంచుకోవాలనే తపనతో వున్నారు. అమరావతి రాజధానిగానే వుంటే ఏ ఒక్కరికీ సినీ పరిశ్రమను తరలించాలనే ఆలోచన రాదుగాని విశాఖ రాజధాని అనే సరికే పరిశ్రమ తరలింపుపై ఆశలు చిగురిస్తున్నాయి.

# రియల్ ఎస్టేట్‌కు కొంచెం ఊపిరొచ్చింది

## అక్రమ లే అవుట్ల క్రమబద్ధీకరణకు జి.ఓ జారీ చేసిన ప్రభుత్వం



రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వమొచ్చి వైయస్ జగన్మోహన్‌రెడ్డి ముఖ్య మంత్రి అయ్యాక అన్ని రంగాల వారికీ బాగానే వుంది. వర్షాలు పడి రైతులు సంతోషంగానే వున్నారు. వివిధ సంక్షేమ పథకాలు పొందుతూ వివిధ రంగాల వాళ్ళు సుఖంగానే వున్నారు. ఈ ప్రభుత్వంలో ప్రధానంగా దెబ్బతిన్నది మాత్రం రియల్‌ఎస్టేట్ రంగంలో వున్న వ్యాపారులు, దాని అనుబంధ వ్యాపారస్థులు మాత్రమే. రియల్ ఎస్టేట్ రంగంతో ఇసుక, ఇటుక, కంకర, పెయింట్స్, ఎలక్ట్రికల్స్, ఎలక్ట్రానిక్స్, ఉడ్... ఒకటేమిటి దాదాపు 50 వ్యాపార రంగాలకు అనుబంధం వుంటుంది. రియల్ ఎస్టేట్ జోరుగా వుంటే ఈ మిగిలిన రంగాల వ్యాపారాలు హుషారుగా వుంటాయి. రియల్‌ఎస్టేట్ కుదేలైతే ఇవి కూడా పడుకుంటాయి.

తెలుగుదేశం ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో నెల్లూరుజిల్లాలో రియల్ ఎస్టేట్‌లో అంత ఊపేమీ కనిపించలేదు. రియల్‌ఎస్టేట్‌కు ప్రోత్సాహకంగా కూడా అప్పటి ప్రభుత్వ నిర్ణయాలు లేవు. గత ఏడాది జరిగిన ఎన్నికలప్పుడు వ్యాపారులంతా కూడా వైసిపి అధికారంలోకి వస్తే రియల్‌ఎస్టేట్ రంగంలో కొంత కదలిక వస్తుందని ఆశించారు, ఆమేరకు వైసిపి కోసం ఈ రంగం వ్యాపారులు ఎక్కువ మంది కృషి చేశారు.

అనుకున్నట్లే వైసిపి అధికారంలోకి వచ్చింది. కాని రియల్‌ఎస్టేట్ వ్యాపారుల ఆశలు తలక్రిందులయ్యాయి. వైసిపి అధికారంలోకి వచ్చిన కొద్దిరోజుల్లోనే జిల్లాలోని లే అవుట్లపై పడ్డారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలంటూ నెల్లూరు నగరం, రూరల్ నియోజకవర్గాల పరిధిలోనే కాకుండా సర్వేపల్లి, గూడూరు, సూళ్లూరుపేట నియోజకవర్గాల పరిధిలో వేసివున్న లే అవుట్లను నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అధికారులు ధ్వంసం చేసి పెట్టారు. అనధికార లే అవుట్లు అని గుర్తించినప్పుడు లే అవుట్ యజమానులకు ముందుగా నోటీసులు కూడా ఇవ్వకుండా లే అవుట్లలో రోడ్లు తవ్వేసి, కాలువలను పగులగొట్టారు. నెల్లూరు లాంటి నగరంలోనే నుడా అప్రూవ్డ్, డిటిసి అప్రూవ్డ్ లే అవుట్లు చాలా తక్కువుగా వున్నాయి. అలాంటిది గ్రామాల పరిధిలో అప్రూవ్డ్ లే అవుట్లు వేయడం కష్టమే! 'నుడా' అప్రూవల్స్ లేవని చెప్పి సూళ్లూరుపేట, పొదలకూరు, గూడూరు, నాయుడుపేట వంటి చోట్ల కూడా లే అవుట్లను తవ్వేయడంతో అప్పటిదాకా పడుతూ లేస్తూ వున్న రియల్ ఎస్టేట్ రంగం ఒక్కసారిగా పూర్తిగా పడుకుంది. వైసిపి అధికారంలోకి వస్తే రియల్ ఎస్టేట్‌లో ఊపొస్తుందనుకుంటే ఇలా తమ బ్రతుకులనే ఊపేసిందని వ్యాపారులు వాపోయారు.

రియల్ ఎస్టేట్ రంగం విరిగిన కాళ్లకు కట్లు కట్టే చర్యలకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇటీవలే మంత్రివర్గ సమావేశంలో అనధికార లే అవుట్లను క్రమబద్ధీకరించాలనే నిర్ణయం తీసుకుని వున్నారు. దానికి సంబంధించిన జి.ఓను రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 8వతేదీన విడుదల చేసింది. ఈ జి.ఓ ద్వారా నగరాలు, పట్టణాలు, పట్టణాభివృద్ధి సంస్థలు, గ్రామాల పరిధిలో ప్లాట్లను, అనధికార లే అవుట్లను క్రమబద్ధీకరించుకునే అవకాశం కల్పించారు.

ఈ జి.ఓతో జిల్లాలో చాలామంది రియల్ ఎస్టేట్ వ్యాపారులకు ఊపిరొచ్చినట్లే! గత నాలుగు నెలలుగా రియల్ ఎస్టేట్‌లో ఎటువంటి లావాదేవీలు లేవు. రిజిస్ట్రేషన్‌లు కూడా స్థబ్దుగా వున్నాయి. వడ్డీలకు అప్పులు తెచ్చి పొలాలు కొని లే అవుట్లు వేసిన వ్యాపారులు వడ్డీల దెబ్బకు నడ్డి విరిగి చేతులెత్తేసే పరిస్థితుల్లో వున్నారు. ఈ జి.ఓ ద్వారా వారు కొంతవరకు గట్టునపడే అవకాశముంది.

## ఇంగ్లీష్ మీడియం ఇందుకే..




రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి ఇంగ్లీష్ మీడియం ప్రవేశపెట్టడాన్ని విపక్షాలు వ్యతిరేకించాయి. తెలుగులోనే విద్యాబోధన వుండాలంటూ వారు వాదించారు. అయితే జగన్మోహన్‌రెడ్డి ఇంగ్లీష్ మీడియం ప్రవేశపెట్టడం ఎంత అవసరమో... ఈ ఫోటోలో బ్యానర్ మీద వ్రాసిన అమరావతి పేరును చూస్తే అర్థమవుతుంది. తెలుగు కోసం తపనపడ్డ వీళ్ళంతా కూడా బ్యానర్ మీద అమరావతిని తెలుగులో వ్రాయకుండా, ఇంగ్లీష్‌లో వ్రాశారు. దానిని కూడా ఖూనీ చేస్తూ... 'అమరావతి'ని కాస్తా **'అమరతి'**ని చేసి పెట్టారు.









## పార్కిన్‌సన్ వ్యాధిపై...

# కేంద్రమంత్రులను కలిసిన నెల్లూరు వైద్యుడు



నెల్లూరీయుడు, అమెరికాలో వుంటున్న ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ మెట్టా వినోద్‌రెడ్డి ఇటీవల ఢిల్లీలో కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి డాక్టర్ హర్షవర్ధన్, కేంద్ర రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీ, కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి శ్రీపాద నాయక్‌లను కలిశారు. పార్కిన్‌సన్ వ్యాధి నివారణ కోసం అమెరికాలోని రాయల్ ఎంపీరియల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూరాలజీలో తాము అభివృద్ధి చేసిన ఔషధాలపై ఆయన వారికి వివరించారు. మంత్రి నితిన్ గడ్కరీ ఆయనను తమ ఇంటికి విందుకు ఆహ్వానించి ఆయన నుంచి ఈ వ్యాధి నివారణ ఔషధాలపై పూర్తి వివరాలు తెలుసుకున్నారు. అలాగే వినోద్‌రెడ్డి ఎఫ్‌డిఏ డైరెక్టర్‌ను కూడా కలిశారు.

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com